మహాపురుషుల ఉపదేశములు

1. మనుష్యత్వము, ముముక్షుత్వము, మహాపురుషసంశ్రయము ఈమూడును దుర్లభములు. దైవానుగ్రహముననే కాని లభించవు. (ఆదిశంకరాచార్య)
2. నీటిచేగాక, చల్లగాలి సోకినంత మాత్రముననే ఉప్పు బస్తా కరుగునట్లు విషయవాసన చేరినంతనే హృదయము మలినము కాగా విషయానుభవమును గూర్చి వేరుగా చెప్పవలయునా? (శ్రీరామకృష్ణ పరమహంస)
3. దీనులను చూచి యెవడు తపించునో,వాడే మహాత్ముడు.తపించనిచో దురాత్ముడే. (శ్రీ వివేకానందస్వామి)

ఓంకార ప్రభావము

సద్గురు శ్రీ మలయాళస్వాములవారి
చరణధూళియగు
గోవిందస్వాములవారిచే సంకల్పితము

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ
ధ్యేయం సర్వముముక్షుభిః"

ప్రకాశకులు :
శ్రీ వ్యాసాశ్రమము
వ్యాసాశ్రమం-పోష్టు (వయా) ఏర్పేడు.
చిత్తూరుజిల్లా, (అం ప్ర.)
1995

శ్రీ సద్గురు మలయాళస్వాములవారి గ్రంథములు

1.	శ్రీ శుష్కవేదాంత తమోభాస్కరం		50-00
2.	అనుభూతి ప్రకాశము		32-00
3.	అవధూతోపదేశములు		2-00
4.	అహింసాపుష్పము		4-00
5.	ఆశ్రమ సంగ్రహచరిత్ర	(ఇంగ్లీషు)	2-00
6.	,,	(హిందీ)	2-00
7.	ఉపదేశ అష్టోత్తరశతి		1-00
8.	కఠోపనిషత్తు		19-00
9.	కర్మసిద్ధాంతము		13-00
10.	శంకరవిజయం		125-00
11	గీతార్థసార కీర్తనము		3-00
12.	గీతాశయము		4-00
13.	గురుభక్తి ప్రభావము		15-00
14.	గురుధ్యానము		2-00
15.	గృహస్థాశ్రమధర్మము		25-00
16.	గురుభోధానందామృతమయ సంజీవనీకీర్తనలు		1-00
17.	జ్ఞానభక్తి సమన్వయబోధిని		1-00
18.	జ్ఞానామృతము		2-50
19.	జిజ్ఞాసురత్నము		2-00
20.	భగవద్గీతా ప్రభావము		4-00
21.	శ్రీ గురుధ్యానము		2-00

వలయువారు:- మేనేజరు, శ్రీ వ్యాసాశ్రమము, వ్యాసాశ్రమము పోస్టు, పిన్ 517 621 ఏర్పేడు-మార్గము, చిత్తూరుజిల్లా, (ఆం. ప్ర.)

ఓంకార ప్రభావము

సద్గురు శ్రీ మలయాళస్వాములవారి

చరణధూళియగు

గోవిందస్వాములవారిచే సంకలితము

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ
ధ్యేయం సర్వముముక్షుభిః"

ప్రకాశకులు :

శ్రీ వ్యాసాశ్రమము

వ్యాసాశ్రమం-పోష్టు (వయా) ఏర్పేడు.

చిత్తూరుజిల్లా, (ఆం.ప్ర.)

1995

ప్రథమ ముద్రణ — 1946వ సం॥రం ప్రతులు—1000
ద్వితీయ ముద్రణ — 1971వ సం॥రం ప్రతులు—2000
తృతీయ ముద్రణ — 1989వ సం॥రం ప్రతులు—1000
చతుర్థ ముద్రణ — 1995వ సం॥రం ప్రతులు—2000

వెల:- 8-00

ప్రకాశకులు:

శ్రీ వ్యాసాశ్రమమువారు

దొరుకుచోటు:—

మేనేజరు: శ్రీవ్యాసాశ్రమము,

వ్యాసాశ్రమము పోస్టు, (వయా) ఏర్పేడు,

చిత్తూరు జిల్లా, [ఆం. ప్ర.]

ఫోన్:- 68528 Std:- 08574

పిన్:- 517 621

ముద్రణ:—

శ్రీ పారాశర్య ముద్రాక్షరశాల, శ్రీవ్యాసాశ్రమము

ఓమ్

పీఠిక

ఓమ్ సర్వే వేదా యత్పదమామనన్తి
తపాంసి సర్వాణి చ యద్వదన్తి।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తేపదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్ ॥
(కఠోపనిషత్తు)

సమస్తవేదము లెద్దానిని ఏకమైన ప్రాప్యమగు ముఖ్యస్థానముగా జెప్పుచున్నవో, సమస్త తపస్సు లెద్దానిని పొందదగిన వస్తువునుగా బోధించుచున్నవో, ఏ అగమ్యగోచరమగు విషయమును వాంఛించినవారలై గురుకులవాసాది లక్షణయుతమైన బ్రహ్మచర్యము ననుష్ఠించుచున్నారో, (ఆత్మారామునియందు రమించుచున్నారో) అట్టి పరబ్రహ్మమును సంగ్రహముగా జెప్పుచున్నాను. 'ఓమితి' ఓమని అట్టి పరబ్రహ్మము ఓంకారశబ్దవాచ్యముగా నున్నది.

పరిశుద్ధాత్మస్వరూపులగు జ్ఞానులారా! 'జ్ఞానాదేవహి కైవల్యం' అనునటుల జ్ఞానమువలననే జీవుడు ముక్తుడగుచున్నాడు. అట్టి జ్ఞానము మనమందఱమవశ్యము సంపాదించవలయును. ఆ జ్ఞానమేదన స్వస్వరూపమును గుర్తెఱుంగుటయే. ఆకలిగొన్నవాడు అన్నముకొఱకు, దప్పిగొన్నవాడు జలముకొఱకును పరితపించునటుల ముముక్షువు సంసారబన్ధమునుండి విడివడి శాశ్వతసుఖమును బడయుటకై ఆతురత జెందినవాడు కావలయును. ఆ ముముక్షువే నిర్వికల్ప జ్ఞానమును బడయగల్గును. నిస్సంశయ జ్ఞానమును సంపాదించి సంసారమును తరింపగోరువారలు "ఓంకారమే వేదం సర్వం ధ్యేయం సర్వముముక్షుభిః" అను ఉపనిషద్వాక్యము రీతిగా సర్వవ్యాపకమగు ఓంకారమునే ఉపాసించ దొడంగవలయు. సకల

శాస్త్రములు, వేదములు, ఉపనిషత్తులు, ప్రణవోపాసనయే ప్రధానమని నొక్కి వక్కాణించుచున్నవి.

ఏ మహానుభావులు కలియుగ వైకుంఠమను శేషాచల క్షేత్రమున నెలకొన్న శ్రీ వేంకటేశ్వరులు ఏలాగున భక్తజనుల కాపాడుచున్నారో అలాగున కాశీబుగ్గ క్షేత్రమున శ్రీ వ్యాసాశ్రమమును స్థాపించి తనను సమీపించియున్న ముముక్షువులనేగాక దేశదేశాన్తరములకు కరుణామూర్తులై చని సర్వజనులను సద్బోధలచే నుద్ధరించుచున్నారో, మఱియు సంసారసాగరమున పడి తాపత్రయాగ్నిచే పరితపించు జనులను, జాతి మత భేదముల గణింపక స్త్రీలనియు, శూద్రులనియు నెంచక కేవల జిజ్ఞాసను మాత్రము గైకొని ప్రణవ నినాదమను మేఘనాదమును ధ్వనింపజేసి జ్ఞానవృష్టిని వర్షించి ముక్తులను జేయుచున్నారో, అట్టి శ్రీశ్రీశ్రీ సద్గురుస్వాములవారు భాషాన్తరములలోనున్న సారభూతములగు వేదాంతగ్రంథముల నాంధ్రభాషలోనికి అనువదింపజేసి సమాస్తాంధ్రలోకమున కెంతో ఉపకారము గావించుచున్నారు. ఈ విషయము కడుంగడు ప్రసిద్ధమే. ఇటుండ ఒకానొక పుణ్యదినమున అనేక జన్మకృత సుకృతరాశి ఫలించినదియో యనునటుల, అపారకరుణామూర్తియగు శ్రీ సద్గురుస్వాములవారు మంత్రరాజమగు ప్రణవమునుగూర్చి అష్టోత్తరశత ప్రమాణములచే ఒక చిన్న పొత్తమును వ్రాయమని నన్నీ పవిత్రకార్యములో నియోగించి కృతార్థుని జేసిరి. ప్రణవప్రభావము అగాధమను విషయము అందఱికి తెలిసిన విషయమే. అయినను శ్రీ సద్గురు కరుణాకటాక్షముచే నా బుద్ధికి స్ఫురించినంత శోధించి వ్రాయడమైనది. ఈ నూటఎనిమిది ప్రమాణములు, దశోపనిషత్తులేగాక మఱికొన్ని ఉపనిషత్తులు, శాస్త్రములు పరిశీలించబడి వ్రాయబడియున్నవి. సాధారణముగా విషయములన్నియు శంకరభాష్యానుసారముగా విశదీకరింపబడి

యున్నవి. ఇద్దానిని చదివినచో ప్రణవసారమును గ్రహించినవారగుదురని యే నా విశ్వాసము. ఓంకారము నుద్దేశించి సంగ్రహముగా తెలియజేయబడుచున్నది.

యదక్షరం వేదవిదో వదన్తి
విశన్తి యద్యత యో వీతరాగాః ।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తేపదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥

వేదార్థము లెఱింగినవారిచేత నాశరహితమైనదని చెప్పబడుచున్నదియును. కామక్రోధాదులను జయించిన యతులచేత ప్రవేశింపబడుచున్నదియును, బ్రహ్మచర్య వ్రతము నవలంబించినవారిచే తెలియగోరబడుచున్నదియునైన మోక్షపదమును నీకు సంగ్రహముగా చెప్పెదను.

ఇట్లు ప్రణవమునే (ఓంకారమునే) ఉత్కృష్టమైన దానినిగా గ్రహించుటకు కారణమేమనగా ఓంకారము పర బ్రహ్మవాచకము, సర్వవ్యాపకము, నామరూపరహితము. సచ్చిదానందస్వరూపమునగు నిర్గుణబ్రహ్మమును సులభముగ ఉపాసన చేయుటకు ఋషిపుంగవులచే సగుణాకారముగ గ్రహింపబడి, తత్ప్రతీకముగ సర్వశబ్దముల ఉత్పత్తికి మూల కారణభూతమైన ఓంకారమును మహర్షులు ఏర్పాటుచేసిరి. గంగా, గోదావరి, సువర్ణముఖరీ మొదలైన నదులన్నియును, తమకుత్పత్తిస్థానమగు సముద్రమును ప్రవేశించి వాటి వాటి నామరూపముల నెట్లు విడుచుచున్నవో, ఆ దే వి ధ ము గ సర్వ శబ్దములును, సమస్తమైన మత గ్రంథములును, ఓంకారమునందే లయములై పోవుటచేత ప్రపంచములోగల మత సంఘములన్నియు వాక్కుతో ప్రణవానుసంధానము చేయుచున్నవని ఋజువగుచున్నది మఱియు మహమ్మదీయ, క్రైస్తవమతస్థులు వారి వారి "కురాన్

బైబిల్" లను ప్రమాణముగ గ్రహించి, ఆయా మత గ్రంథములందు చెప్పబడిన మార్గముల ద్వారా లేక మంత్రముల ద్వారా వాక్కుతో భగవంతుని ఉపాసనము చేయుచున్నామని చెప్పుదురు. ప్రార్థనలు వాక్కుతో ఉచ్చరింపబడినప్పుడు ధ్వని (శబ్దము) కలుగుచున్నది. ఆ శబ్దము మొదట (ఆదియందు, కంఠము నుండి ప్రారంభించునపుడు 'అ' అక్షరముతో ప్రారంభ మగును, కావుననే వ్యాకరణ నిర్మాతలు "అకుహ విసర్జనీయానాం కంఠః" అని వ్యాకరణ సూత్రమును ఏర్పాటు చేసిరి. శ్రీ భగవద్గీతలో "అక్షరాణాం అకారోఽస్మి" అక్షరములలో 'అ' కారమును నేను అనుటలో శ్రీ కృష్ణభగవానుడు తన్ను అక్షరములకు మొట్టమొదటిది యగు 'అ' కారముతో పోల్చుకొన్నాడు. మధ్య పెదవులు మూయు సందర్భమున 'ఉ' అను శబ్దము స్వరము సహజముగ గలుగుచున్నది. 'అ' కారముతో ప్రారంభమై శబ్దాంత్యమగు 'మ్'తో అనగా మకారముతో పూర్తియగుచున్నది. అనగా నోరు 'మ్' అని మూయుటతో శబ్దము అంతమగుచున్నది. అనగా 'ఓమ్' శబ్దము అకారముతో ప్రారంభమై, ఉకారమును మధ్య గలిగి, మకారముతో అంతమగును. అ + ఉ + మ్=ఓమ్. ఇదియే ఓం కారశబ్దరూపము. ప్రపంచములోగల సర్వమతముల వారును ఇట్టి ఓంకారశబ్దమునే ఉపాసించుచున్నారు. జైన, బౌద్ధ మతములు గూడ తమ తమ సిద్ధాంతములను ఏర్పరచుకొనునప్పుడు "అహింసా పరమోధర్మః" "సత్యమేవ జయతి నానృతమ్" "సత్యం వద ధర్మంచర" అనెడి వేదభావములను గ్రహించియే యున్నారు. జైనులును, బౌద్ధులును, ఏ నిర్వాణసిద్ధిని పరమావధి యని చెప్పిరో, దానినే అద్వైతులు ఆత్మసాక్షాత్కారమనియు, ద్వైత, విశిష్టాద్వైతులు విష్ణుసాయుజ్యప్రాప్తియనియు నుడివిరి. ఆస్తికమతస్థులు రామ, కృష్ణ, శివ, నారాయణ, త్రిపురసుందరి ఇత్యాది నామములతో

జపించినను, క్రైస్తవులు "ఓ తండ్రి, సర్వలోకవాసి, భగవంతుడా మమ్ము రక్షింపుము" అని ప్రార్థన చేసినను, మహమ్మదీయులు "ఖుదాలాయి లాహ యిల్లిల్లా, అల్లా" ఇత్యాది ప్రార్థనలు చేసినను, సమస్తప్రార్థనలకు అనగా శబ్దములకు ఓంకారమే మూల కారణమైనందున సర్వజనులును విశ్వేశ్వరుని అనగా సత్యజ్ఞానానందలక్షణములుగల యాపరబ్రహ్మనే ఆయా మత సాంప్రదాయవాక్యములతో ప్రార్థన చేసినవారలగుచున్నారు. ఆర్యసమాజ, బ్రాహ్మ సమాజాది నూతన సంస్థలకు, న్యాయ, మీమాంసా, వైశేషిక, యోగ, సాంఖ్య, వేదాంతములను షణ్మతములకును, జైన, బౌద్ధమతములకును మూలమంత్రము ప్రణవమే. ఇట్టి ప్రణవమును ధ్యానించి ముముక్షువులు సంసారసముద్రమును దాటి శాశ్వత సుఖమును బడయుదురు గాక! ఈగ్రంథము ప్రణవశక్తిని గురించి ఎక్కువగా ప్రతిపాదించినందుచే 'ప్రణవప్రభావ'మని నామధేయము చేయబడెను. ఓంకారములోనే పుట్టి ఓంకారములోనే పెరిగి ఓంకారములోనే లయించుచున్నట్టి సకల మతతత్త్వములున్ను అన్యోన్యరమ్యములై వర్తించుటకొఱకు ఉపదేశించుచున్నవను పరమార్థమును సకలమతాభిమానులును తెలిసికొని ఏకయోగ క్షేమమై జీవించుటకు ప్రణవస్వరూపి అనుగ్రహించుగాత!

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఇట్లు,

శ్రీ సద్గురు చరణధూళి,

సాధు గోవిందస్వామి.

ఓం తత్సద్బ్రహ్మణే నమః

ఓంకారప్రభావము

ఓంకారవాచ్యమాత్మానం సచ్చిదానందలక్షణమ్ ।
సమస్తమంగళోపేతం జగత్ప్రభుముపాస్మహే ॥

ఓంకారస్సర్వవేదానాం సారస్తత్త్వప్రకాశకః ।
తేన చిత్తసమాధానం ముముక్షూణాం ప్రకాశతే ॥

సమస్తవేదములయొక్క సారము ప్రణవమై యున్నది. అదియే బ్రహ్మతత్త్వమును బోధించుచున్నది. ఆ ఓంకారాలంబనముచే ముముక్షువులందఱు శాశ్వతమగు మనశ్శాంతిని బొంది బ్రహ్మములో గలియుచున్నారు. కనుక అట్టి ఉత్తమమగు సారభూతమగు ప్రణవము ముముక్షువుల యుపయోగముకొఱకై ప్రకాశింప జేయబడుచున్నది.

పవిత్రాత్మస్వరూపులగు ముముక్షువులారా! యథార్థముదెలియ జేయబడుచున్నది.

యం శైవాస్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాన్తినో
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తేతి నైయాయికాః ।
అర్హన్నిత్యథజైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోఽయంవోవిదధాతువాంఛితఫలంత్రైలోక్యనాథోహరిః ॥

ఏ అఖండస్వరూపుని, విజ్ఞానఘనుని, శివోపాసకులు శివుడనియు, వేదాన్తులు బ్రహ్మమనియు, బౌద్ధులు బుద్ధదేవుండనియు, తర్కశాస్త్ర నిపుణులు కర్తయనియు, జైనులు అర్హన్ననియు, మీమాంసకులు కర్మయనియు, ఉపాసించుచున్నారో, అట్టి సర్వ స్వరూపాధారుడై అద్వితీయుండగు పరమాత్మ సమస్తదోషముల హరింప జేసినవాడై మీరు కోరినదాని నొసంగుగాక! "యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహం" అను గీతావచనానుసారముగ పరమకారుణికుండగు భగవంతుడు భక్తులు గోరునటుల సాక్షాత్కరించుచున్నాడు. ప్రపంచములో సకలమతములును ఓంకారోపాసనలోనే లీనమగుచున్నవి.

ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా ।
కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాంగళికావుభౌ ॥ 1

ఓంకారశబ్దము, అథశబ్దమున్ను ఈ రెండు మొదట బ్రహ్మదేవుని కంఠమును ఛేదించుకొని బయటికి వచ్చినవి. అందువలన ఈ రెండు శబ్దములు మంగళస్వరూపములు, సమస్తవిఘ్నములను నశింపజేయునవి. శుభమును గలుగజేయునని చెప్పినందుచే ఏ ఏ మతస్థులు శివేత్యాది శబ్దములచే ఏ ఏ స్వరూపము నుపాసించుచున్నారో, ఆ శబ్దోపాసనలన్నియు ప్రణవోపాసనకన్న భిన్నములుకావు. కార్యకారణరూపమైన ఏ ప్రపంచముగలదో, అది ఓంకారరూపమగుట వలన సర్వ స్వరూపము ఓంకారము. సకలపదార్థముల ఆకారము తన తన నామముకన్న ఎటుల వేరుకాదో, అటుల సమస్త నామవాచక శబ్దములన్నియు ఓంకారమునకన్న వేరుగాదు. ఓంకారము బ్రహ్మరూపముగ నున్నది. విచారదృష్టివలననో 'ఓం' అను అక్షరము బ్రహ్మమునందు అధ్యస్తము. (కల్పితము). బ్రహ్మము దీనికధిష్ఠానము. అధ్యస్తముయొక్క స్వరూపము అధిష్ఠానమునకన్న వేరుగాదు. కాబట్టి

ఓంకారమును బ్రహ్మరూపమని యెఱింగి చింతించవలయును, ఓంకారము బ్రహ్మమునకు వాచకముగ నున్నది. బ్రహ్మము వాచ్యము. అవ్యస్త అధిష్ఠానములకువలె వాచ్యవాచకముల కభేదమని ఎఱుంగవలయును. కనుక వాచ్యమగు బ్రహ్మమునకన్న వాచకమగు ఓంకారము వేరుగాదు. కనుక బ్రహ్మమే ఓంకారము. ముముక్షువులు ప్రణవోపాసనచే శీఘ్రముగ గమ్యస్థానమును జేరగలరు.

2. "మంత్రాణాం ప్రణవశ్శిరః" అన్నిమంత్రములకు ప్రణవమే శిరస్సుగా నున్నది. ప్రణవమును మననము చేసినవాఁడు ముని యగుచున్నాడు. ఈ ఓంకారము పరబ్రహ్మప్రాప్తికి అత్యంత సన్నిహితమగుటచే పరబ్రహ్మమునే బోధించుచున్నది. కనుక ఓంకారము పరబ్రహ్మమునకు ప్రతీకముగ అవయవముగ నున్నది. ఇందుకు ప్రమాణము "పాతంజలి యోగసూత్రము."

3. "తస్య వాచకః ప్రణవః" ఆ పరబ్రహ్మమునకు ప్రణవము వాచకము, ఓంకారనామోచ్చారణమే కాకుండ భావనగూడ నుండవలయును.

4. "తజ్జపస్తదర్థభావనమ్" కేవలము ప్రణవశబ్దమునే ఉచ్చరించిన గుండులేని తుపాకివలె లక్ష్యమును భేదింపజాలడు. కనుక జపముతోగూడ ప్రణవార్థమగు ఆత్మభావనయు ముఖ్యముగ నుండవలయును. భావనలేని జపము పరిపూర్ణజ్ఞానమును గలుగచేయజాలదు. కనుక "భావశుద్ధియే జ్ఞానసిద్ధి" యని మహాత్ములు జెప్పియున్నారు. "యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ" అన్నట్లు భ్రమరకీటక న్యాయము మాడ్కి ఏ పురుషుడు ఎట్టి భావనజేయుచున్నాడో, అట్టి స్వరూపమునే బొందుచున్నాడు. కనుక ఓంకారార్థమగు పరబ్రహ్మమునే భావించి తాను పరబ్రహ్మమే యగుచున్నాడు.

5. ప్రణవో హి పరబ్రహ్మ ప్రణవః పరమం పదమ్ ।
ప్రణవం సర్వవేదాద్యం సర్వదేవమయం విదుః ॥

ఓంకారమే పరబ్రహ్మము. అదియే ఉత్కృష్టస్థానము. "ఉద్ఘాతః ప్రణవో యాసాం" అని కాళిదాసోక్తి చొప్పున సమస్తవేదములకు మూలము ప్రణవమే. బాగుగ విచారించిన సమస్తశాస్త్రములు, సమస్తవేదములు, సకలోపనిషత్తులు పరబ్రహ్మప్రాప్తి సాధనముగా ఓంకారమునే ప్రతిపాదించుచున్నవి.

—: సూ త సం హి త :—

6. మృద్వాసనే సమాసీనో యతచిత్తేంద్రియ క్రియః ।
ఓమిత్యుచ్చారయేత్తావత్ మనోయావత్ప్రసీదతి ॥

మృదువగు కంబళ్యాది ఆసనములమీద క్రమముగ కూర్చుండి, సమస్త ఇంద్రియవికారముల నణచి మనస్సు నిర్మలమగువఱకు (మనస్సు ఆత్మలో ఐక్యమగు పర్యంతము) ప్రణవమును జపించవలయును,

7. ఓంకారేణ ప్లవేనైవ సంసారాబ్ధిం తరిష్యతి ।

ఓంకారమనెడి తెప్పచేతనే సంసారసముద్రమును తరింపగలుగుచున్నాడు.

—: ము ం డ కో ప ని ష త్తు :—

8. ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం
శరంహ్యుపాసా నిశితం సంధయీత ।
ఆయమ్య తద్భావ గతేన చేతసా
లక్ష్యం తదేవాక్షరం సోమ్య విద్ధి ॥

ఆత్మతోటి ఓంకారానుసంధానము చెప్పబడు చున్నది.

ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడిన మహాస్త్రమగు ప్రణవమనెడీ ధనుస్సును గ్రహించి ఉపాసనచేత (సంతత ధ్యానముచేత) తీక్ష్ణముగ చేయబడిన బాణము ననుసంధానము చేయవలయును. ఆ శరమును లాగి, (ఇంద్రియములతో కూడిన అంతఃకరణమును విషయాదుల నుండి మరలించి) లక్ష్యమందే (బ్రహ్మమందే) యుంచి బ్రహ్మ భావనారూపమగు మనస్సుచే లక్ష్యమగు బ్రహ్మమునే భేదించ వలయును. ఈ విషయమే నిక సవిస్తారముగ చెప్పబడుచున్నది.

9. ప్రణవో ధనుశ్శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే ।
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ ॥

ఏలాగున ధనుస్సు శరానుసంధానమునకు గారణమగు చున్నదో, అలాగున బ్రహ్మమునందు ఆత్మాను సంధానమునకు ప్రణవము గారణమగు చున్నది. బాగుగ యెక్కు పెట్టబడిన ధనుస్సు చేత బాణము ఎటుల లక్ష్యమును జేరునో, అటులనే అభ్యసింపబడిన ప్రణవముచేత ఆత్మ సంస్కరింపబడినదై అక్షరపరబ్రహ్మమునందు చేరుచున్నది. అనగా ప్రణవము ధనుస్సు. బాణము ఆత్మ. లక్ష్యము బ్రహ్మమై యున్నది. కనుక అప్రమత్తుడై, విరక్తుడైన జితేం ద్రియుడగు ముముక్షువు ప్రమాదరహితమగు (ఏకాగ్రమగు మనస్సు చేత) లక్ష్యభూతమగు బ్రహ్మమును భేదించవలయును. అనగా బ్రహ్మమును చేరవలయుననుట. బాణము లక్ష్యమును భేదించిన తరువాత లక్ష్యముతో ఏకమగునటుల ఆత్మ బ్రహ్మముతో కలసిన తరువాత తాను బ్రహ్మరూపుడే యగుచున్నాడు.

10. యస్మిన్ ద్యౌః పృథివీ చాంతరిక్షమోతం
మనః సహప్రాణైశ్చసర్వైః ।
తమేవైకం జానథ ఆత్మానమన్యావాచో
విముంచథామృతస్యైష సేతుః ॥

ఏ పరబ్రహ్మమునందు స్వర్గలోకము, పృథివి, అంతరి క్షము, సమస్తప్రాణములతో కూడుకొన్నటువంటి మనస్సున్ను, ఇవి కూడుకొనియున్నవో, అట్టి పరబ్రహ్మమును అన్నిటికి ఆశ్రయము గాను, అద్వితీయముగాను దెలిసికొనుడు. ఇతరమైన శబ్దజాలమును విడువుడు, ఈ ప్రణవమే అమృత స్వరూపమగు మోక్షప్రాప్తికి సేతువుగ నున్నది.

11. తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి ।
నాన్యః పంథావిద్యతేఽయనాయ॥(శ్వేతాశ్వతర)

ఓంకారమే పరబ్రహ్మప్రాప్తికి మూలముగ నున్నది. ఇంతకన్న వేరుమార్గములేదని వక్కాణించుచున్నది.

12. అరా ఇవ రథనాభౌ సంహతా యత్రనాడ్యః।
స ఏషోఽంతశ్చరతి బహుధా జాయమానః ॥
ఓమిత్యేవం ధ్యాయథ ఆత్మానం ।
స్వస్తివః పారాయ తమసః పరస్తాత్ ॥

రథచక్ర కుండమునందు అరములు (ఆకులు) అమర్చబడి నట్లు ఏహృదయమునందు సమస్తనాడులు ప్రవేశించినవై అమర్చబడి దేహమునంతయు వ్యాపించియున్నవో, అట్టి హృదయకమలమునందు సాక్షిభూతుడగు అంతరాత్మ చూచుచు, వినుచు, తలంచుచు తెలిసికొను చున్నవాడై, అనేకవిధములగు కోపము, సంతోషము మొదలుగాగల అంతఃకరణ ధర్మములచే పుట్టుచున్నవానివలె నున్నవాడై సంచ రించుచున్నాడు. అట్టి ఆత్మను ఓంకారమే అలంబనముగలవారలై ధ్యా నింపుడు. అట్టిప్రణవోపాసకులగు మీకు తమస్సుకంటె పరమమైన బ్రహ్మప్రాప్తికొరకు స్వస్తిశుభమగుగాక! (నిర్విఘ్నమగుగాక.)

ఉద్గీథోపాసన (ప్రణవోపాసన)

13. ఓమిత్యేతదక్షరం ఉద్గీథముపాసీత ।
ఓమితిహ్యుద్గాయతి తస్యోపవ్యాఖ్యానమ్ ॥

'ఓం' అనే అక్షరము పరమాత్మకు ప్రియమగు నామధేయముగా నున్నది. ఎందుకనగా ఓంకారోచ్చారణము చేతనే పరమాత్మ ప్రసన్నుడగుచున్నాడు. భగవంతుని విగ్రహాదులు యెటుల భగవంతునికి ప్రతీకములై (జ్ఞాపకములై) యున్నవో, అటులనే ప్రణవము పరమాత్మకు ప్రతీకముగనున్నది. ఈప్రకారము పరమాత్మకు నామధేయముగాను, ప్రతీకముగాను నున్నందుచేత ఓంకారము పరమాత్మోపాసనకు ముఖ్యసాధనమని సర్వవేదాన్తసిద్ధాన్తము. కనుక "ఓమిత్యేతదక్షరం" ఓం అనే యీ అక్షరాత్మమగు ఉద్గీథ శబ్దవాచ్యమగు ప్రణవము నుపాసించుడు. (పరమాత్మవాచకమగు ప్రణవమునందు స్థిరమైన బుద్ధిని నిలుపుడు.) ఓంకారమునకు ఉద్గీథమని పేరు యెటుల వచ్చినదని శ్రుతియే చెప్పుచున్నది. "ఓమితిహ్యుద్గాయతి తస్యోపవ్యాఖ్యానమ్" సామవేదమునకు సంబంధించిన స్తోత్రవిశేషమునకు 'ఉద్గీథభక్తి'యని పేరు గలదు. ఆ స్తోత్రములో 'ఓమ్' అని ఆరంభించి ఎందువలన ఉద్గాత (గానము జేయువాడు) ఉచ్చైర్గానము చేయుచున్నాడో అందువలన ఓంకారమునకు ఉద్గీథమని వ్యాఖ్యానము చేయబడినది. ఉద్గీథమనగ ఓంకారమని యర్థము.

14. ఏషాం భూతానాం పృథివీరసః, పృథివ్యా ఆపోరసః ।
అపామోషధయో రసః, ఓషధీనాం పురుషో రసః ॥
పురుషస్య వాగ్రసో, వాచ ఋగ్రస ఋచస్సామరసః ।
సామ్న ఉద్గీథో రసః ॥ అ 1, ఖం 1, మం 2

సమస్త చరాచరాత్మకములగు భూతములకు భూమి రసః = ఆధారము. ఓషధులకు పురుషుడాధారము. పురుషునకు వాక్కు శ్రేష్ఠము, అట్టి వాక్కునకు ఋక్ మంత్రము శ్రేష్ఠము. ఋక్కుకన్న సామశ్రేష్ఠము. అట్టి సామమునకుకూడ ఉద్గీథము (ప్రణవము) శ్రేష్ఠము.

15. స ఏషరసానాం రసతమః పరమః
పరార్ధ్యోఽష్టమో యదుద్గీథః ॥ 1-1-3

ఈ ఉద్గీథమనెడి ఓంకారము రసానాం = ముందు జెప్పబడిన భూతములలో మిక్కిలి సారతమమైనది. పరమః = పరమాత్మకు ప్రతీకమైనది, పరార్ధ్యః = పరమాత్మవలె నుపాసింపదగినది. ఎందుకనగ పృథివ్యాదులలో ఉద్గీథమనునది ఎనిమిదవది. అందువలన అన్నిటికంటెను శ్రేష్ఠమైనది.

16. ఆపయితా హ వై కామానాం భవతి
య ఏత దేవం విద్వానక్షరముద్గీథముపాస్తే॥ 1-1-7

ఏ విద్వాంసుడు అక్షరమగు ఉద్గీథోపాసన చేయుచున్నాడో, అట్టివాడు సమస్తకోరికలను బొందుచున్నాడు. ఈ ప్రణవమే సమస్తము నొసంగుచున్నది. ఇందులకు ప్రమాణము శ్రుతి "తం యథా యథోపాసతే తదేవ భవతి."

17. తద్వా ఏతదనుజ్ఞాక్షరం యద్ధి
కించానుజానాత్యోమిత్యేవ తదాహ
ఏషా ఏవ సమృద్ధిర్యదనుజ్ఞా ।
సమర్ధయితాహవై కామానాం భవతి
య ఏత దేవం విద్వానక్షరముద్గీథముపాస్తే॥ 1-1-8

ఈ ప్రణవాక్షర మంగీకారవాచకముగ నున్నది. అదెటులన లోకములో జ్ఞానిగాని, ధనికుడుగాని జ్ఞానము కొఱకైనా,

ధనముకొఱకైనా అనుమతి నిచ్చునపుడు 'ఓం' యనుచున్నాడు. మఱియు యీ ఓంకారము సమృద్ధిరూపముగా నున్నది. అనగ యీఓంకారము సర్వసమృద్ధిని కలుగజేయుచున్నది. ఉపాసకునికి సమస్తకోరికల నిచ్చుచున్నది కనుక ఇట్టి ఓంకారమును విద్వాంసుడు పాసించు చున్నాడు.

ఓంకారస్తుతి

18. తేనేయం త్రయీవిద్యా వర్తత
ఓమిత్యాశ్రావయత్యోమితి ।
శంసత్యోమిత్యుద్గాయ త్యేతస్యై
వాక్షరస్యాపచిత్యై మహిమ్నారసేన ॥ 1-1-9

ఓంకారముచేతనే మూడు వేదములు ప్రవర్తించుచున్నవి. తద్విహిత కర్మలును ప్రవర్తించుచున్నవి. అధ్వర్యుడు ఓం అని వినిపింప చేయుచున్నాడు. ఓం అని చెప్పుచున్నాడు. ఓం అని ఉచ్చైర్గానము చేయుచున్నాడు. కనుక సమస్తయాగకర్మలును యీ ఓంకారముయొక్క స్తుతి కొఱకగుచున్నవి. ఇందుకు ప్రమాణముగీత, "స్వకర్మణా తమభ్యర్చ్యసిద్ధిం విన్దతి మానవః" ఈ అక్షరము యొక్క మహిమచేత (ఋత్విక్ యజమానాది ప్రాణముచేత) యీ అక్షరముయొక్క రసముచేత వ్రీహియవాదిరూప హోమ ద్రవ్యము చేత యాగహోమాదులు ఓంకారోచ్చారణ పూర్వకముగా చేయబడుచున్నవి. తమ కర్మచే ఆ ఓంకారమును పూజించి మానవుడు సిద్ధిని బొందుచున్నాడు.

19. తేనోభౌ కురుతో యశ్చైత దేవం వేద
యశ్చనవేద, నానాతు విద్యాచా విద్యా చ
యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా,

తదేవ వీర్యవత్తరం భవతీతి
ఖల్వేతస్యైవాక్షరస్యోపవ్యాఖ్యానం భవతి॥ 1-1-10

ప్రణవలక్ష్యమగు పరబ్రహ్మమును తెలిసికొని ఉపాసించు విజ్ఞానియు, ప్రణవ యథార్థస్వరూపము నెఱుంగక నుపాసించువాడును వీరిద్దరు ఓంకారము నుపాసించు చున్నారు. అయినను వీరికిఫలభేదములు గలవు. ఎటులనగ విద్యావిద్యలు భిన్నస్వరూపములు. భిన్నఫలములు గలవి. విద్యతోగూడుకొన్నవాఁడువిద్వాంసుడు. అవిద్యతోకూడుకొన్నవాడ విద్వాంసుఁడు• ఏవిద్వాంసుడు ప్రణవస్వరూపమును చక్కగ నెఱింగి ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన రీతిగా (ఆత్మానుసంధాన రూపయోగముచే) ధ్యానించు చున్నాడో, అట్టివాడు సారవంతమైన ఫలమును (శాశ్వత సుఖమును) బొందుచున్నాడు. తదితరుడు అవిద్వాంసుడు సారభూతమగు కర్మానుగుణఫలమును బొందుకున్నాడు. ఇదియే యీ అక్షరముయొక్క వ్యాఖ్యానమగుచున్నది.

20. దేవాసురాహవై యత్ర సంయేతిర ఉభయే
ప్రాజాపత్యాస్తద్ధదేవా
ఉద్గీథ మాజహ్రురనేనైనానభిభవిష్యామ ఇతి॥1-2-1

పూర్వము ప్రజాపతి కుమారులగు దేవతలు, అసురులు వీరిద్దరు యుద్ధమును జేసిరి దేవతలు మేము ఉత్కృష్టులము గావలయునని ఉద్గీథము నుపాసించిరి. మేము యుపాసనచేతనే రాక్షసులను తిరస్కరించగలమని నిశ్చయించుకొనిరి.

21. తం హాంగిరా ఉద్గీథ ముపాసాంచక్ర,
ఏతము ఏవాంగి రసం మన్యన్తేఽంగానాం యద్రసః ॥
1-2-10

అంగిరసుడనే మహర్షి ముఖ్యప్రాణమను ఆత్మ స్వరూపమైన ఓంకారము నుపాసన జేసెను, అందుచే యీ ఓంకారమునకు

ఆంగిరసమని బేరు వచ్చెను. మఱియు ఓంకారము అంగములకు ప్రాణ మగుటవలన అంగిరసమని జెప్పంబడియె.

22. తేన తం హబృహస్పతి రుద్గీథ ముపాసాంచక్ర,
ఏతము ఏవ బృహస్పతిం మన్యన్తే వాగ్ఘి
బృహతీ తస్యా ఏష పతిః ॥ 1-2-11

ముఖ్యప్రాణమగు ప్రణవమును బృహస్పతి యుపాసించెను. అందుచే ప్రణవమునకు బృహస్పతి యని పేరు పొడమెను. బృహస్పతి యనగ వాక్కు, అట్టి వాక్కులకు పతిగా యున్నందున ఈ ప్రణవము బృహస్పతి యయినది.

23. తేన తం హాయాస్య ఉద్గీథ ముపాసాంచక్ర,
ఏతము ఏవాయాస్యం మన్యన్త ఆస్యాద్యదయతే ॥

ఆయాస్యుండనే మహర్షి యా ఉద్గీథోపాసన(జేసెను. అందువలన యీ ఓంకారము ఆయాస్యమని పేర్కొనబడియె. ఎందువలన యీ ప్రణవశబ్దము ముఖమునుండి బయట వెడలుచున్నదో, అందువలన ఆయాస్యమని జెప్పబడియె.

24. తేన తంహ బకోదాల్భ్యో విదాంచకార,
స హ నైమిషీయానా ముద్గాతా బభూవ
స హాస్మైభ్యః కామానాగాయతి ॥ 1-2-13

ఇటుల దల్భకుమారుడగు బకుడు యీ ప్రణవమును బాగుగ దెలిసికొని యీ ప్రాణవిజ్ఞాన సామర్థ్యమువలన, నైమిశారణ్యములోని యజ్ఞముల కన్నిటికి ఉద్గాతగా అయెను. అతడే యాజ్ఞకుల కొఱకు సమస్తకోరికలను గానముజేసెను.

25. ఆగాతాహవై కామానాం భవతి
య ఏతదేవం విద్వానక్షరముద్గీథముపాస్తే
ఇత్యధ్యాత్మమ్ ॥ 1-2-14

ఏ విద్వాంసుడు యీ అక్షరమగు ప్రణవమును చింతించుచున్నాడో, అట్టివాడు సమస్తకోరికలను బొందుచున్నవాడగుచున్నాడు. ఇటుల ఆత్మవిషయకమగు ఉద్గీథోపాసన జెప్పబడినది.

26. అథాధిదైవతం య ఏవాసౌతపతి,
తముద్గీథముపాసీతోద్యన్వా ఏషప్రజాభ్య
ఉద్గాయతి, ఉద్యగ్ంస్తమోభయమపహన్త్య
పహన్తాహవై భయస్య తమసో భవతి
య ఏవంవేద॥ 1-3-1

ఇచ్చట ఆదిత్యోపాసన జెప్పబడుచున్నది. ఏ సూర్యుడు ప్రకాశించుచున్నాడో అట్టి ఆదిత్యుని ప్రణవస్వరూపునిగా నుపాసించవలయును. ఆసూర్యుడు ఉదయించుచు ప్రజలకొఱకుఅన్నాదుల నిచ్చుచున్నాడు. సూర్యుడు ఉదయించకపోయినచో ధాన్యాదులు ఫలించవు గదా? మఱియు చీకటి భయమును బోగొట్టుచున్నాడు.

ఈప్రకారముగా నుపాసించుచున్న వారలకు జనన మరణాది రూప అజ్ఞాననాశము గలుగుచున్నది. ఇచ్చట ఆదిత్యుడనగ పరబ్రహ్మమనియు గ్రహించవచ్చును.

27. యదా వాబు చ మాప్నోత్యోమిత్యే
వాతిస్వరత్యేవం సామైవం యజురేష
ఉస్వరో యదేతదక్షర మేత దమృత
మభయం తత్ప్రవిశ్యదేవా అమృతా
అభయా అభవన్ ॥ 1-4-4

ఋఙ్మంత్రముల నుచ్చరించునప్పుడు ఓం అని మిక్కిలి యాదరముతో ఉచ్చరించుచున్నారు. ఇటులనే సామవేదమును, యజుర్వేదమును ఉపక్రమించునపుడు ఉకార రూపమగు ప్రణవమునే ఉచ్చరించుచున్నారు. ఈవిధముగ ఉచ్చరింపబడినందున స్వరమనియు దీనికి నామధేయము సిద్ధించినది. అమృతస్వరూపమును,

అభయస్వరూపమును అక్షరమును అగు యీ ఓంకారము నుపాసించిన వారు అమృతత్వమును(శాశ్వతసుఖమును) అభయత్వమును (అద్వితీయత్వమును) బొందుచున్నారు. దేవతలు ఈప్రణవము నుపాసించియే అమృతులనియు, అభయులనియు చెప్పబడిరి.

28. అథ ఖలు య ఉద్గీథః స ప్రణవో, యః ప్రణవః
స ఉద్గీథ, ఇత్యసౌ వా ఆదిత్య ఉద్గీథ ఏషప్రణవ
ఓమితి హ్యేషస్వరన్నేతి॥ 1-5-1

ఏది ఉద్గీథమని జెప్పబడుచున్నదో, అదే ప్రణవమని జెప్పబడుచున్నది. ఎయ్యది ప్రణవమని పేర్కొనబడెనో, అదియే ఉద్గీథమని ప్రసిద్ధికెక్కెను. ఇకను సూర్యుడుగూడ ఉద్గీథమని చెప్పబడుచున్నాడు. ఆదిత్యునకెటుల ఉద్గీథమని పేరు వచ్చినదనగా సూర్యుడు ఉద్గీథమను ప్రణవమునే "స్వరన్" ఉచ్చరించుచు ఉదయించుచున్నాడు.

29· అథాధ్యాత్మం య ఏవాయం ముఖ్యః ప్రాణ
స్తముద్గీథముపాసీతోమితి హ్యేషస్వరన్నేతి॥ 1-5-3

ఆధ్యాత్మదృష్టితో ఓంకారోపాసన జెప్పబడుచున్నది. ఏదైతే ముఖ్యప్రాణముగనున్నదో (ఆత్మగాఉన్నదో) అట్టి ఆత్మస్వరూపమగు ప్రణవమును 'ఓం' అని ఉపాసించవలయును. ఈ ముఖ్యప్రాణమే 'ఓం' అని అంగీకారవచనమును సూచించుచున్నదివలె వాగాది ఇంద్రియములయొక్క ప్రవృత్తికొఱకు ప్రవర్తించుచున్నది.

30. త్రయో హోద్గీథే కుశలా బభూవుః
శిలకః శాలావత్యశ్చైకితాయనో
దాల్భ్యః ప్రవాహణోజైవలిరితి,
తేహోచురుద్గీథే వైకుశలాః స్మోహంతోద్గీథే
కథాం వదామ ఇతి ॥ 1-8-1

ఈ ఉద్గీథోపాసనలో యెవరెవరు నిపుణులైరను విషయము తెలియబడుచున్నది. శలావంతుని కుమారుడగుశిలకమహర్షియు, చికితాయన కుమారుండగు చేకితానుండును, దల్భగోత్రములో బుట్టిన జీవల పుత్రుడగు ప్రవాహణుడున్ను, వీరు ముగ్గురు మేము ప్రణవోపాసనలో నిపుణులము కనుక ఉద్గీథోపాసనను గుఱించి కథను జెప్పెదమనిరి.

31. ప్రజాపతిర్లోకా నభ్యతప త్తేభ్యోఽభితప్తేభ్య
స్త్రయీ విద్యా సంప్రాస్రవత్తా మభ్యత—
ప త్తస్యా అభితప్తాయా ఏతాన్యక్షరాణి
సంప్రాస్రవంతభూర్భువః స్వరితి॥ 2-23-2

32. తాన్యభ్యతప త్తేభ్యోఽభితప్తేభ్య ఓంకారః
సంప్రాస్రవ త్తద్యథా శంకునా సర్వాణి వర్ణాని
సంతృణ్ణాన్యేవ మోంకారేణ సర్వావాక్సం
తృణ్ణోంకార ఏవేదం సర్వమోంకార ఏవేదం
సర్వమ్ ॥ 2-23-3

బ్రహ్మదేవుడు అనగా విరాట్ పురుషుడు లోకముల నుద్దేశించి లోకములలోసారమును గురుతెఱుంగవలయునను కోరికతో తపస్సునుజేసెను. చింతింపబడిన లోకములకంటె సారభూతములైనవి మూడు వేదములు (ఋగ్యజుః సామః) అని బ్రహ్మదేవునియొక్క మనస్సులో గోచరమాయెను. తిరుగ ఆ మూడువేదములు బాగుగ ఆలోచింపబడెను. వాటిలో "భూర్భువస్స్వః అని వ్యాహృతిరూపమైన మూడక్షరములు సారభూతములైనవని బ్రహ్మదేవునిచే నిశ్చయింపబడెను. మఱియు ఆ అక్షరములున్ను బాగుగ ధ్యానింపబడినవి. వాటికన్నను ప్రణవమే సారభూతమైనదని ప్రజాపతికి చిత్తమున ధారణ గలిగెను. ఆ ఓంకారబ్రహ్మమెట్టిదనగ శంకువుచే అనగా కాడచే (పెద్ద ఈనెచే) ఆకులన్నియు ఎటుల వ్యాప్తములైయున్నవో అటులనే ప్రణవబ్రహ్మముచే (పరమాత్మ ప్రతీకముచే) సమస్తశబ్దజాలములున్ను

వ్యాపింపబడియున్నవి. ఇందులకు ప్రమాణము శ్రుతి "అకారో వై సర్వావాక్ ఓంకార ఏవేదం సర్వం ఓంకార ఏవేదం సర్వం" ఈ సమస్తమంతయు ఓంకార బ్రహ్మమే, ఈ సమస్తమంతయు ఓంకార బ్రహ్మమే.

—: అ థ బృ హ దా ర ణ్య కో ప ని ష త్ :—

33. ఓం ఖం బ్రహ్మ ఖం పురాణం వాయురం
ఖమితి హ స్మాకౌహరవ్యాయణీపుత్రో
వేదోఽయం బ్రాహ్మణా విదు
ర్వేదై నేన యద్ వేదితవ్యమ్ ॥ 5–1–1

"ఓం ఖం బ్రహ్మ" అనునదిమాత్రము మంత్రమనితెలియ వలయును. తదితరమగునది వ్యాఖ్యానరూపమగు బ్రాహ్మణము. ఈ బ్రాహ్మణము ధ్యానకర్మయందే ఈ మంత్రముయొక్క వినియోగమును జెప్పుచున్నది. "ఓం ఖం బ్రహ్మ" బ్రహ్మయనునది విశేష్యపదము. ఖం అనునది విశేషణము. విశేష్యవిశేషణములకు అభేదమనియెఱుంగ వలయును. ఖం అ న గా ఆకాశము బ్రహ్మమనగ బ్రహ్మము. ఈ రెండింటికి అభేదము చెప్పుటచేత ఆకాశము బ్రహ్మమని అర్థము సిద్ధించుచున్నది. మఱియు ఖం బ్రహ్మ (ఆకాశ బ్రహ్మ, పరమాత్మా కాశమనియు చెప్పవచ్చును) ఈ పరమాత్మాకాశము ఓంకారశబ్ద వాచ్యార్థముగాను, ఓంకారశబ్ద స్వరూపముగాను ఉన్నది. ఇచ్చట ఓంకారశబ్దము బ్రహ్మోపాసన సాధనముకొఱకు ప్రయోగింపబడినది. ఖం బ్రహ్మ=ఆకాశబ్రహ్మము (పరమాత్మాకాశము) ఓం = ఓంకారశబ్ద వాచ్యము. ఈ ప్రణవమే పరబ్రహ్మోపాసనకు ముఖ్యసాధనమని దృఢపరచుటకై ప్రమాణముగా శ్రుతి వాక్యములు చూపింపబడు చున్నవి. "ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరం" అని కఠో పనిషత్. "ఓమిత్యాత్మానం యుఞ్జీత" అని మహానారాయణోపనిషత్. "ఓమిత్యేతేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత" అనిప్రశ్నోపని షత్." ఓమిత్యేవంధ్యాయథ ఆత్మానం" అని ముండకోపనిషత్"ఓమితి

శంసతి ఓమిత్యుద్గాయతి" ఇవి మొదలుగాగల చోట్లయందు వేదముల యొక్క ప్రారంభములోను,అంతములోను, ఓంకారము ప్రయోగించుట వలన ఓంకారమే ధ్యానమునకు ముఖ్య సాధనమను అభిప్రాయముతో ఓంకారశబ్దోపదేశము చేయబడినదని తెలియుచున్నది.మఱియు బ్రహ్మ వాచకములగు అనగా బ్రహ్మమును బోధించునట్టి బ్రహ్మ, ఆత్మ,సత్యం, జ్ఞానమిత్యాది పదము లనేకములుగలవు. పైజెప్పినశ్రుతులప్రమాణము లచే ప్రణవమే సమీపవర్తియగు, ప్రియతమమగు బ్రహ్మమున కభి ధానము (నామమని) ప్రతిపాదింపబడు చున్నది. కనుకనే బ్రహ్మ జ్ఞానము కొఱకు యీ ఓంకారమే పరమసాధనము. ఈ ఓంకారమిరు తెఱంగులై (ప్రతీకమై, అభిధానమై) వెలయుచున్నది. బ్రహ్మమునకు ప్రతీకమని, అభిధానమనియు, ఇరు తెఱంగులై వెలయుచున్నది. విగ్రహములు విష్ణ్వాది దేవతలయొక్క ప్రతీకములై (జ్ఞాపకచిహ్న ములై) యెటులనున్నవో, అటులనే బ్రహ్మమునకు ప్రతీకముగ ప్రణవమున్నది. ఓంకారముచేతనే బ్రహ్మము తెలిసికొన దగిన దిగా నున్నది. ఓంకారము నవలంబించినవానికి పర బ్రహ్మము అనుగ్రహించుచున్నది. ఇందులకు ప్రమాణము.

"ఏతదాలంబనం శ్రేష్ఠమేత దాలంబనం పరం,
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే"
కఠోపనిషత్.

ఖం అనుచోట ఆకాశభూతమునందు జ్ఞానము కలుగకుండుట కొఱకై వివరింపబడుచున్నది. ఖం పురాణం = సనాతనమగు ఆకాశము పరమాత్మాకాశము, పరబ్రహ్మమని అర్థము. ఏ పరమాత్మా కాశము "పురాణం ఖం" సనాతనమైన ఆకాశమని జెప్పబడినదో, అట్టి బ్రహ్మము చక్షురాది యింద్రియముల కగోచరమైనందుచేతను, నిరాలంబన వస్తువును గ్రహించుటకు శక్తిలేకపోవుట చేతను శ్రద్ధా భక్తి పూర్వక భావనారూపముచేత నాలంబనమగు ప్రణవమందే

పరమాత్మ ప్రవేశించుచున్నాడు. భక్తులు విష్ణ్వాది శిలా ప్రతిమలందు విష్ణ్వాది దేవతలను భావనము జేయునటుల పర బ్రహ్మోపాసకులు ప్రణవమునందు పరబ్రహ్మమునే భావించ వలయును. "వాయురంఖం" వాయురం = వాయువుతో కూడుకొన్నది, ఖం = అకాశము, అకాశమేను, పరమాత్మా కాశముగాదు. ఖ శబ్దము వాయువుతో కూడుకొన్న ఆకాశమునందే ముఖ్యముగ వ్యవహరింపబడుచున్నది. ఇటుల కౌరవ్యాయణీ పుత్రుడు చెప్పెను.ఫలించిన అర్థమేమనగా = "పురాణం ఖం" = నిరుపాధిక బ్రహ్మము. వాయురంఖం = సోపాధిక బ్రహ్మము, (సగుణబ్రహ్మము)న్ను ఓం కారస్వరూపములే. ప్రతిమాదులు విష్ణ్వాదులయొక్క ప్రతీకముల మాడ్కి ఓంకారము పరబ్రహ్మప్రాప్తి సాధనముగ నున్నది. ఇందులకు ప్రమాణము ప్రశ్నోపనిషత్ "ఏతద్వై సత్యకామ పరంచాపరం చ బ్రహ్మ యదోంకారః" ఈ ఓంకారము వేదమనియు చెప్పబడుచున్నది. ఈ ఓంకారముచేత "యద్వేదితవ్యం" ఏదైతే దెలియదగినదో దానిని తెలిసికొనుచున్నాడు, అందువలన వేదమను ఓంకారము పరమాత్మకు వాచకముగ నున్నది. ఇట్టి అభిధానమగు ఓంకారముచేత అభిధేయమగు (చెప్పబడు) ప్రకాశ్యమానమగు (ప్రకాశింపజేయబడు) తెలిసికోదగిన ఏ బ్రహ్మమును సాధకుడు పొందుచున్నాడో, అందువలన యీఓంకారము వేదమని బ్రాహ్మణాః = బ్రహ్మజ్ఞానులు తెలిసికొనిరి. బ్రహ్మజ్ఞానులకు యీ ప్రణవము అభిధానరూపసాధనముగా ఇష్టమైయున్నది. ఒకవేళ యీ ఓంకారము వేదమనుట అర్థవాదవాక్యముగ స్తుతివాక్యముగ నుండవచ్చును. సమస్తవేదములుకూడ ఓంకారమేను, శాఖాదులచే భిన్నములైన ఋుగ్ యజుర్, సామాధర్వణ మంత్రములుకూడ ఓంకారస్వరూపములై ప్రణవభావముచే గూడుకొనియున్నవి. అదెటులన ఛాందోగ్యోపనిషత్ "తద్యథా శంకునా సర్వాణి పర్ణాని" ఇంతకు ఫలించినదేమనగ, ఓంకారము వేదము

ఏది తెలియదగినదై యున్నదో అద్దానిని "అనేన ఓంకారేణ" యీ ఓంకారముచేతనే తెలియుచున్నాడు. అందువలన నిది వేదమని చెప్పబడియె. ఇటులనే జ్ఞానసాధనములగుటచే వేదముల కన్నిటికి వేదత్వము సిద్ధించినది. అయినను ఆ వేదములకన్న ఓంకారమే శ్రేష్ఠమయినందుచే ముఖ్యసాధనమని యెఱుంగవలయును. ఇటుల యెవరెఱింగిన వారనగా? బ్రహ్మజ్ఞానులే.బ్రహ్మజ్ఞానులచే యిది ప్రణవ ఉద్గీథాది నామధేయములచే చెప్పబడెను. ఈ ప్రణవోపాసన మాత్రము చేసినచో సమస్తవేదోపాసనలు చేసినటులేను. ఈ ప్రకారముగ బృహదారణ్యకోపనిషత్తు ఉద్ఘోషించుచున్నది.

—: అ థ మాం డూ క్యో ప ని ష త్ :—

34. హరిః ఓం ఓమిత్యేతదక్షరమిదం సర్వం
తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి
సర్వమోంకార ఏవ,యచ్చాన్య త్త్రికాలాతీతం
తదప్యోంకార ఏవ ॥

పరాపర బ్రహ్మస్వరూపమైనట్టియు, అక్షరమగునట్టియు, ఆ ఓంకారముయొక్క ఉపవ్యాఖ్యానము. ఉపవ్యాఖ్యానమనగ బ్రహ్మ ప్రాప్తికుపాయమగుటవలన బ్రహ్మసమీపముగా స్పష్టముగా చెప్పుటకుపక్రమింపబడుచున్నది. భూతము (జరిగినది) భవత్-వర్తమానము (జరుగుచున్నది) భవిష్యత్తు (జరుగబోవునది) అనెడి కాలత్రయ పరిచ్ఛేదమేదికలదో, అదియు ఓంకారమే. కాలత్రయాతీతమై కాలముచేత పరిచ్ఛేదముగాక, కార్యము మాత్రముచేతనే తెలిసికొనబడెడి అవ్యాకృతాదికమేదికలదో, అదియు ఓంకారమే.

35. సర్వగ్ంహ్యేతద్బ్రహ్మాయమాత్మా బ్రహ్మ ।
సోఽయమాత్మా చతుష్పాత్ ॥

ఏ సమస్తము ఓంకారమాత్రమే చెప్పబడినదో, ఆ సమస్తము పరబ్రహ్మమే. బ్రహ్మమని పరోక్షముగ చెప్పబడిన దానిని మరల ప్రత్యక్షముగ "అయమాత్మాబ్రహ్మ" యని విశేషించి శ్రుతి చెప్పుచున్నది. ఈ ఆత్మ సౌకర్యార్థము చతుష్పాత్తుగ విభజించి చెప్పబోవుదానినే ప్రత్యగాత్మగ, అభినయ పూర్వకముగ శ్రుతి చెప్పినది. ఓంకారవాచ్యుడును, పరాపరస్వరూపుడును అగు ఆత్మ కార్షాపణము వలె (ఒకానొక నాణ్యమువలె) నాలుగు పాదములు గలవాడు.

36. సోయమాత్మాఽధ్యక్షరమోంకారోఽధిమాత్రం।
పాదామాత్రా మాత్రాశ్చపాదా అకార ఉకారో
మకార ఇతి ।

ఈ అత్మ అధ్యక్షరము=అక్షరమే ఆలంబనముగ గలది ఆ అక్షరమేమి యనగా ఓంకారమే. అ ఓంకారము నాలుగు పాదములు గలదిగా మాత్రల ననుసరించి విభజింపబడుచున్నది. ఆత్మకు పాదములెట్టివో, ఓంకారమునకు మాత్రలట్టివి. ఆ మాత్రలేవి యనగా అకారను, ఉకారము, మకారము అనునవి.

37. జాగరితస్థానో వైశ్వానరోఽకారః
ప్రథమా మాత్రాఽఽప్తేరాదిను-
త్వాద్వాఽఽప్నోతి హవై సర్వాన్కా-
మానాదిశ్చ భవతి య ఏవం వేద ॥

వెనుకటి మంత్రమునందు ఓంకారమాత్మ స్వరూపమని మొత్తముమీద చెప్పబడిన విషయమే. యీ మంత్రమునందు విశ్వ, తైజస, ప్రాజ్ఞాది ఆత్మపాదములకు అకార, ఉకార, మకారాది మాత్రలకు గల విశేషవిభేదము యీ మంత్రమున చేయబడుచున్నది. జాగరితమే స్థానముగా గల వైశ్వానరు డెవడో అతడు ఓంకారము యొక్క అకారము (ప్రథమమాత్ర), వైశ్వానరుడు అకారమనుట ఏ సామ్యము చేత ననగ, ఆప్తివలన, ఆప్తియనగ వ్యాపించుట. అకారముచేత వాక్ప్రపంచమంతయు వ్యాపింపబడియున్నది. ఇందులకు

శ్రుతి ప్రమాణము. అకారోవై సర్వా వాక్" అకారముచేత వాక్ప్రపంచము ఏ విధముగ వ్యాపింపబడియున్నదో, అట్లే వైశ్వానరునిచేత జగమంతయు వ్యాప్తమైయున్నది. ఇందులకు శ్రుతి ప్రమాణము. ఛాందోగ్యోపనిషత్, "తస్యహవై తస్యాత్మనో వైశ్వానరస్యమూర్థైవ సుతేజాః" ఆది గలదు. ఆదిమత్తనంబడును. అకారమనెడి యక్షరము అక్షరములలో నెటుల మొదటిదో అట్లే వైశ్వానరుడున్ను మొదటి వాడే, ఈ వెనుక చెప్పబడిన అకారము వాక్ప్రపంచమంతయు వ్యాపించియున్నదనెడి సామ్యమువలనగాని లేక యీఆది మత్వ సామ్యమువలనగాని వైశ్వానరుడు అకారమగుచున్నాడు, (ఈవైశ్వానరుడున్ను, అకారమున్ను యొకటియే యని నెఱింగినవానికి కలుగు ఫలమేమనగా—నతడు సకల మనోరథములను బొందుచున్నాడు. పూజ్యులలో మొదటివాడగుచున్నాడు.

38. స్వప్నస్థానస్తైజస ఉకారో ద్వితీయా
మాత్రోత్కర్షాదు భయత్వాద్వోత్కర్షతి హవై
జ్ఞానసంతతిం సమానశ్చ భవతి, నాస్యా-
బ్రహ్మవిత్కులే భవతి య ఏవం వేద ॥

స్వప్నస్థానముగా గల ఏ తైజసుడు గలడో, అతడే ఓంకారముయొక్క ఉకారమనెడి ద్వితీయ మాత్ర. ఉకారము తైజసమనుటకు సామ్యమేమనగ ఉత్కర్షమువలన అకారముకంటె, ఉకారము పై భాగమున నున్నదానివలె నుండును. అట్లే విశ్వునికంటె తైజసుడు పైభాగమున నుండును. ఉభయమగుటవలన అనగా అకార మకారములకు మధ్యస్థమై యుండుటవలన అట్లే విశ్వప్రాజ్ఞులకు మధ్యస్థుడై తైజసుడుండుటవలన నుభయుండనంబడును. ఈ విషయము నెఱింగినవానికి గల ఫలము జెప్పబడుచున్నది. విజ్ఞాన సంతతిని (పుత్రులను, శిష్యులను) వృద్ధిని పొందింప చేసుకొనుచున్నాడు. మిత్రులగు వారెట్లుందురో, అట్లే శత్రుపక్షము

వారికిన్ని యితడు ద్వేష్యుడు కాడు. ఇతని వంశమునందు బ్రహ్మ వేత్త కానివాడు జన్మింపడు.

39. సుషుప్తిస్థానః ప్రాజ్ఞోమకార-
స్తృతీయామాత్రా, మితేరపీతేర్వా
మినోతి హ వా ఇదగ్ం సర్వమపీతిశ్చ
భవతి య ఏవం వేద॥

సుషుప్తియే స్థానముగా గల ఏ ప్రాజ్ఞుడు గలడో అతడే ఓంకారము యొక్క మకారమనెడి తృతీయ మాత్ర. ఏ సామ్యము చేత మకారమును ప్రాజ్ఞుడని శ్రుతి పలుకుచున్నదనగా, మితివలన, మితి యనగ మానము (కొలత పాత్ర) విశ్వతైజసులు ప్రాజ్ఞునిచేత ప్రళయోత్పత్తి సమయములందు ప్రళయ నిర్గమనములచేత తవ్వ, మానిక మున్నగు కొలత పాత్రలతో ధాన్యము కొలుచునటుల కొలవబడుచున్నారు. అటులే ఓంకారము నొక పర్యాయ ముచ్చరించి మరల నుచ్చరించునపుడు అకార ఉకార మకారములందు ప్రవేశించి, బయలు వెడలుచున్న వానివలె కనంబడును. అపీతి వలన "అపీతి" యనగా ప్రణయము, ఏకీభావము. ఓంకారము నుచ్చరించు నపుడంత్యాక్షరమగు మకారమునందు అకార ఉకారములు ఏకీభావమును పొందుచున్నవానివలె నుండును. అట్లే విశ్వతైజసులు సుషుప్తి కాలమునందు ప్రాజ్ఞునియందేకీభావమును పొందుదురు. ఈ సాదృశ్యము చేత ప్రాజ్ఞమకారములకు ఏకత్వము యుక్తమే. ఎవడీవిషయము నెఱుంగునో అట్టి విద్వాంసుడు పొందెడి ఫలమేమనగా యీ జగమంతయు కొలుచుచున్నాడని అనగా జగత్తు యొక్క యాథార్థ్యమును యెఱుగుచున్నాడని యర్థము. "అపీతి" యనగా జగత్కారణాత్మకుడగుచున్నాడని యర్థము.

ఈ మంత్ర త్రయమునందు అవాంతర ఫలవచనము అనగా విశ్వుడు అకారమని నెఱింగిన యిట్టి ఫలము గలుగుననియు, తైజసుడు ఉకారమని యెఱింగిన యిట్టి ఫలము గలుగుననియు, ప్రాజ్ఞుడు మకారమని నెఱిగిన ఇట్టి ఫలము కలుగుననియు విడివిడిగ ఫలము బోధింపబడుచున్నది. ఇట్లు బోధించుటచే వేఱు వేఱు యుపాసనలు మాత్రము కావు. మరేమన బ్రహ్మ ధ్యాన సాధన భూతమగు ఓంకారముయొక్క స్తుతియందే, ఆ విధముగ బోధించినదానికి తాత్పర్యముగాని యుపాసనాభేదములు చెప్పుటయందు మాత్రము తాత్పర్యము గాదు.

40. అమాత్రశ్చతుర్థోఽవ్యవహార్యః
ప్రపంచోపశమశ్శివోఽద్వైత
ఏవ మోంకార ఆత్మైవ
సంవిశత్యాత్మనాఽఽత్మానం య ఏవం వేద ॥

అమాత్రమనగా అకారాది మాత్రలు లేనిది. ఓంకారము అదియే చతుర్థము అనగా తురీయమగు నాత్మ మాత్రమే. అభిధాన అభిధేయ రూపములగు వాక్కు, మనస్సులు క్షీణించుటచేత అవ్యవహార్యమగుచున్నది. ప్రపంచోపశమమున్ను, మంగళస్వరూపమున్ను, అద్వైతమున్ను ఓంకారమేయగుచున్నది.ఈవిధముగ ఓంకారమాత్రలు ఆత్మపాదములు ఒకటియే యని యెఱింగినవాని చేతప్రయుక్తమగు, త్రిమాత్రమగు ఓంకారము ఆత్మస్వరూపమే. ఇట్టి జ్ఞాని మాత్రలను పాదములను, తనయందు లీనమొనర్చుకొని స్వరూపముచేతనే పారమార్థికమగు ఆత్మస్వరూపమును బొందుచున్నాడు. పరమార్థవిదులగు బ్రహ్మవేత్తలు మూడవది యగు బీజభావమును దహింపచేసి ఆత్మయందు ప్రవిష్టులైనవారు కావునను తురీయునియందు బీజభావము

లేక పోవుటచేతను, వారికి పుట్టుకయేలేదు. ఇది రజ్జువేగాని, సర్పము గాదనితెలిసిన పిదప రజ్జువునందైక్యమైన సర్పము, తద్వివేకులకు మఱల బుద్ధి సంస్కారమువలన పుట్టజాలదుగదా? ఉత్తమాధికారులు గాక, మందమాధికారులై, బ్రహ్మప్రాప్తి మార్గగాములై, ఆత్మ ప్రాప్తి సాధనభూతముగ, ఓంకారమాత్రలు ఆత్మపాదములు సమానములే యని యెఱింగి యుపాసించువారలకు, ఓంకారము బ్రహ్మప్రాప్తికి ఆలంబనమగుచున్నది.

41. ఓంకారం పాదశో విద్యాత్పాదామాత్రా న సంశయః।
ఓంకారం పాదశో జ్ఞాత్వా న కించిదపి చిన్తయేత్ ॥

ఓంకారమును పాదములుగా తెలిసి కొనవలయును. ఈ విధముగ ఓంకారమును తెలిసికొనిన యెడల తాను కృతార్థుడగుచున్నాడు. కావున దృష్టార్థమైనట్టిగాని, అదృష్టార్థమైనట్టిగాని, ప్రయోజనమును కొంచమైన నతడు తల పెట్టగూడదు

42. యుఞ్జీత ప్రణవేచేతః ప్రణవో బ్రహ్మ నిర్భయమ్ ।
ప్రణవే నిత్యయుక్తస్య న భయం విద్యతే క్వచిత్ ॥

ఇట్టి ప్రణవమునందు సాధకుడు మనస్సును బొందింపవలయును. ప్రణవమే నిర్భయమగు బ్రహ్మము. ప్రణవమునందెల్లపుడు యుక్తుడై యుండువానికి దేనివల్ల నుండియు భయములేదు. ఇందులకు శ్రుతి ప్ర మా ణ ము "విద్వాన్ నబిభేతి కుతశ్చన" (విద్వాంసుడగువాడు అనగా ఆత్మజ్ఞాని దేనివలననుండియు భయపడడు)

43. ప్రణవోఽహ్యపరం బ్రహ్మ ప్రణవశ్చ పరస్స్మృతః ।
అపూర్వోఽనన్తరోఽబాహ్యోఽనపరః ప్రణవోఽ
వ్యయః ॥

ప్రణవమే పరాపర బ్రహ్మస్వరూపము. పరమార్థముగ ఓంకారమాత్రలు, ఆత్మపాదములు క్షీణింపగ పరుడగు ఆత్మయే బ్రహ్మమగును. అపూర్వమనగ పూర్వము కారణములేనిదనుట. అనంతరమనగ భిన్నజాతీయమగునది మరొకటిలేదనుట, అబాహ్యమనగవేరగు బాహ్యపదార్థములు లేదనుట, అనపరమనగా మరియొక కారణము దీనికి లేదనుట. ఉప్పుకల్లునకు లోపల వెలుపల నంతట ఉప్పుని రసమెటులుండునో, అదే విధముగ ఆత్మస్వరూపమగు ప్రణవము బాహ్యాభ్యంతరములయందు అజమని యభిప్రాయము.

44. సర్వస్య ప్రణవోహ్యాదిర్మధ్యమన్తస్తథైవ చ ।
ఏవంహి ప్రణవం జ్ఞాత్వా వ్యశ్నుతే తదనంతరమ్ ॥

ఆది. మధ్య, అంతములనగ యుత్పత్తి, స్థితి, ప్రళయములు. దారు గజము. రజ్జుసర్పము, ఎండమావుల నీరు, స్వప్నము వలె పుట్టుచున్న ఆకాశాది ప్రపంచముల కంతయు యింద్రజాలకుడు మున్నగువారలే యుత్పత్తి, స్థితి, లయములకు కారణభూతులెట్లగుచున్నారో, అట్లే ప్రపంచమునకు ప్రణవము మాయావి మున్నగు వారివలె కారణభూతమగుచున్నది. ఇటుల నెఱింగినవాడు వెంటనే ఆత్మభావమును బొందుచున్నాడు.

45. ప్రణవం హీశ్వరం విద్యాత్సర్వస్య హృది సంస్థితమ్ ।
సర్వవ్యాపినమోంకారం మత్వా ధీరో న శోచతి ॥

సకలప్రాణిజాతములయొక్క స్మృతి ప్రత్యయాస్పదమగు, హృదయమందున్న ఈశ్వరునిగానే ప్రణవము నుపాసించవలయును ఆకాశమువలె యంతట వ్యాపించి యున్నట్టి ఓంకారమును అసంసారియగు ఆత్మగా నెఱింగిన బుద్ధిమంతునకు శోకింపదగిన నిమిత్తమే లేదు. కావున అతడు శోకింపడు. ఇందులకు శ్రుతి ప్రమాణము "తరతిశోకమాత్మ విత్" మున్నగునవి,

46. అమాత్రోఽనన్తమాత్రశ్చద్వైతస్యోపశమశ్శివః ।
ఓంకారో విదితో యేన స మునిర్నేతరో జనః ॥

మాత్రారహితమైనట్టియు. తురీయమైనట్టియు ఓంకారము అనంత మాత్రము. మాత్రయనగ, ఇంతమాత్ర మైనదని పరిచ్ఛేదము. అట్టి పరిచ్ఛేదము లేనిది యనంత మాత్రము. ఇంతమాత్రమైనది యిది యని నిర్ణయించి చెప్పుటకు వీలు లేనిదని భావము. అనర్థాత్మకము లగు సర్వవిధ ద్వైతములు లేక పరమానందాత్మకస్వరూపము కలిగి యుండుటచేత శివమనంబడుచున్నది. ఇట్టి ఓంకారమును మాండూక్యశ్రుతి కారికలందు వివరింపబడిన దానిని యెవడెఱుం గునో, అట్టి వాడా పరమార్థతత్త్వమును సర్వదా స్మరించుచుండును. కావున యతడే ముని యని చెప్పబడును. ఈ ఓంకారతత్త్వము నెఱుంగనివాడు శాస్త్రవేత్తయైనను ముని యని చెప్పుటకు అర్హుడు కాజాలడు.

—: అథ మైత్రాయిణ్యుపనిషత్ :—

47. ద్వేవావ బ్రహ్మణో రూపే మూర్తం
చామూర్తం చా, థయన్మూర్తం తదసత్యం,
యదమూర్తం తత్సత్యం, తద్బ్రహ్మ
యద్బ్రహ్మ తజ్జ్యోతి, ర్యజ్జ్యోతిః స ఆదిత్యః,
స వా ఏష ఓమిత్యే తదాత్మా
స త్రేధాత్మానం వ్యకురుత ఓమితి
తిస్రోమాత్రా ఏతాభిః సర్వమిదమోతం
ప్రోతం చైవాస్మిన్ని త్యేవం హ్యాహై
తద్వా ఆదిత్య ఓమి త్యేవం
ధ్యాయం స్తథాత్మానం యుంజీతేతి ॥

బ్రహ్మకు మూర్తమని, అమూర్తమని రెండు రూపములు గలవు. అందులోమూర్తమనునది ప్రపంచాత్మకము. అది అసత్యము. ఏదైతే అమూర్తముగ నున్నదో (ఇంద్రియముల కగోచరమో) అది సత్యము. ఏదైతే వ్యాపక బ్రహ్మమో, అదే పరబ్రహ్మము. ఏదైతే పరంజ్యోతియో, అదియే జ్యోతి, అదియే యాదిత్యుడుగ (సమస్తవస్తువులను ప్రకాశింప జేయునదిగ) నున్నది. ఆదిత్యుడనే పరమాత్మ ఓంకారస్వరూపుడుగా నున్నాడు. ఆ యాదిత్యుడు త్రిమూర్త్యాత్మకమగు తన రూపమును జేసెను. 'ఓమ్' అనునది మాత్రాత్రయ విశిష్టము, ఈ మాత్రలచేతనే ఓత ప్రోత న్యాయముగ (బాహ్యాభ్యంతరములు నిండి) సమస్తము వ్యాపింపబడియున్నదని చెప్పబడెను. అట్టి యాదిత్యుడే (పరబ్రహ్మమే) ఓంకారస్వరూపమని ధ్యానించుచు, ఆత్మను పరబ్రహ్మములో ఐక్యపరచవలయును. పై జెప్పిన రీతిగ మైత్రాయిణ్యుపనిషత్తు ప్రతిపాదించుచున్నది.

—: అథ నారాయణోపనిషత్ :—

48, ఓం తద్బ్రహ్మ, ఓం తద్వాయుః, ఓం తదాత్మా,
ఓం తత్సత్యం, ఓం తత్సర్వం, ఓం తత్పురోర్నమః॥

ఆ బ్రహ్మము ఓంకారవాచ్యముగ నున్నది. వాయువు (ముఖ్యప్రాణము) ఓంకారస్వరూపముగ నున్నది. ఆ ఆత్మయు ఓంకార స్వరూపమే. సత్యము ఓంకారమే,సమస్తము ఓంకారమే.అట్టి ఓంకారము కొఱకు నమస్కారము.

49. అద్వైతమనిర్వాచ్యం బ్రహ్మ, ప్రణవాత్మకం బ్రహ్మ,
ప్రణవాత్మకత్వేనోక్తం బ్రహ్మ, ప్రణవాద్యఖిల
మంత్రాత్మకం బ్రహ్మ, పాదచతుష్టయాత్మకం
బ్రహ్మ, కిం తత్పాదచతుష్టయం, (బ్రహ్మ భవతి)
అవిద్యాపాదః, సువిద్యాపాదః, ఆనందపాదః,

తురీయపాదశ్చేతి, తురీయపాదః, తురీయ
తురీయం తురీయాతీతం చ, కథం పాదచతుష్టయస్య
భేదః, అవిద్యాపాదః ప్రథమః పాదః సువిద్యా
పాదో ద్వితీయః, ఆనందపాద స్తృతీయః,
తురీయపాద స్తురీయః ఇతి ॥

ఇచ్చట బ్రహ్మస్వరూపము ప్రతిపాదింపబడుచున్నది. "ద్వితీయాద్వై భయం భవతి" అను శ్రుతి చెప్పిన ద్వైతము కానిది అద్వైతము, భయరహితమైనదని భావము. ఇటుల భయరహితమై అనిర్వాచ్యమై (ఇంద్రియాతీతమై) యున్నది బ్రహ్మము. ప్రణవస్వరూపము బ్రహ్మమే. ప్రణవవాచ్యము బ్రహ్మమే. ప్రణవము మొదలుగాగల సకల మంత్రస్వరూపము బ్రహ్మమే. అట్టి బ్రహ్మము నాలుగు పాదములతో గూడుకొనియున్నది. అట్టి నాలుగు పాదములతో గూడుకొనిన బ్రహ్మము యెట్టిదనగా- నాలుగు పాదములు (1) అవిద్యాపాదము, (2) సువిద్యాపాదము, (3) ఆనందపాదము, (4) తురీయపాదము. —తురీయపాదమైతే, తురీయము, తురీయాతీతమని రెండు విధములు. ఆ నాలుగు పాదములయొక్క భేదమెటులనగా— అవిద్యా పాదము మొదటి పాదము. సువిద్యాపాదము రెండవది, ఆనందపాదము మూడవది, తురీయపాదము నాలుగవది.

50. మూలావిద్యా ప్రథమపాదే నాన్యత్ర,
విద్యానందతురీయాగ్ం సర్వేషు పాదేషు
వ్యాప్యతిష్ఠన్తి, ఏవం తర్హి విద్యాదీనాం భేదః
కథమితి, తత్తత్ప్రాధాన్యేన తత్తద్వ్యపదేశో
వస్తుతస్త్వభేద ఏవ, తత్రాధ స్తనమేకం
పాదమవిద్యాశబలం భవతి, ఉపరితన పాదత్రయం
శుద్ధబోధానందలక్షణమమృతం భవతి ॥

ప్రథమ పాదములో మూలావిద్య యున్నది. విద్యానంద తురీయాంశములు మిగత సమస్త పాదములలోను వ్యాపించియున్నవి. ఇటులైనచో భేదమెటులన "ప్రాధాన్యేన వ్యపదేశమ"ను న్యాయము చెప్పిన (ఏ ఏ అంశములో ఏది ఏది ప్రధానమైనదో ఆ అంశమునుబట్టి వ్యవహరించుట) విచారింపగ యీ విద్యాదులన్నిటికి నభేదమేను. (అంతయు చైతన్యమే) ఆపాదములలో ప్రథమ పాదము అవిద్యా శబలము (అవిద్యతో కూడుకొన్నది.) గానగుచున్నది. మిగిత మూడు పాదములు శుద్ధబోధానందరూపముగ అమృతమయములుగ నగుచున్నవి.

—: అథ తైత్తరీయోపనిషత్ :—

51. ఓమితి బ్రహ్మ, ఓమితీదం సర్వం ఓమిత్యే—
తదనుకృతిర్హస్మవా అప్యోశ్రావయే—
త్యాశ్రావయన్తి ఓమితి సామాని గాయన్తి
ఓమ్ శోమితి శస్త్రాణి శంసన్తి, ఓమిత్యధ్వర్యుః
ప్రతిగరం ప్రతిగృణాతి, ఓమితి బ్రహ్మ ప్రసౌతి,
ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి.
ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ,
బ్రహ్మోపాప్నవానీతి బ్రహ్మైవోప్నోతి ॥

ఓమ్ అనే శబ్దస్వరూపమును బ్రహ్మమని నిర్విషయముగు మనస్సుతో ధారణ జేసి యుపాసించవలయును. ఎందుకనగా సమస్తశబ్దస్వరూపములు ఓంకారముచేతనే వ్యాపింపబడియున్నవి వాచకమున్ను, వాచ్యమున్ను రెండు ఓంకారస్వరూపములే. ఓంకారస్తుతి ప్రతిపాదింపబడుచున్నది. ఓంకారమే ముముక్షువులచేత నుపాసించదగి

యున్నది. "నాన్యః పంథా అయనాయ విద్యతే" యన్నట్లు వేరే మార్గము లేదు. ఓంకారము అనుకరణ శబ్దముగా నున్నది. అదెటులన — చేయుచున్నాను, పోవుచున్నాను. చేయబడినది. చెప్పబడినది ఇత్యాది విషయములలో 'ఓమ్' అని అనుకరణశబ్దము యనుభవసిద్ధమై యున్నది. ఇందువలన ఓంకారము అనుకరణమని చెప్పబడియె. "హస్మవా" మొదలగు శబ్దములు ప్రసిద్ధార్థమును తెలుపుచున్నవి. ఈ శబ్దములన్నిటికి ఓంకారముయొక్క అనుకరణము ప్రసిద్ధమే. మఱియు "ఓ శ్రావయ" అని ప్రేరణ పూర్వకముగా యాజ్ఞికులు యీ ప్రణవమునే ప్రతిధ్వనించుచున్నారు. "సామగాః" — సామగానమును జేయువారలు "ఓమ్" అనియే సామమంత్రములను గానము చేయుచున్నారు. (శస్త్రమును పఠించు వారలు) "ఓమ్‌శోమ్" అని శస్త్రములను బఠించుచున్నారు. అటులనే 'ఓమ్' అనియే అధ్వర్యుడు ప్రతిగరము నుచ్చరించు చున్నాడు. బ్రహ్మ "ఓం" అనియే యనుజ్ఞ నిచ్చుచున్నాడు. 'ఓం' అనియే అగ్నిహోత్రము ననుగ్రహించుచున్నాడు. బ్రాహ్మణుడు (శ్రోత్రియుడు) ఓమని ప్రవచించుచు, ఓమనియే యధ్యయనము చేయుచున్నాడు. బ్రహ్మను (వేదమును) బొందబోవుచున్నాను. అథవా నేను పరమాత్మను బొందితిని. ఆత్మను బ్రహ్మములో పొందింపబోవుచున్నానని ఓమని చెప్పుచున్నాడు. ఇటుల చెప్పినందుచే ఫలించినదేమనగా ఓంకారోపాసకుడు ఓంకారమునే ఆలంబనముగా గైకొని, బ్రహ్మమునే బొందుచున్నాడు. ఓంకారపూర్వకముగా చేయబడు క్రియలన్నియు తప్పక సఫలములగుచున్నవి. కనుక ప్రణవమునే పరబ్రహ్మమని విడువకనే యుపాసించవలయునని ఫలితార్థము. ఈ ప్రకారముగా తైత్తరీయోపనిషత్తు యుపదేశించుచున్నది.

—; అథ ప్రశ్నోపనిషత్ :—

52. మం॥ అథ హైనం శైబ్యః సత్యకామః పప్రచ్ఛ,
స యోహవై తద్భగవన్మనుష్యేషు
ప్రాయణాంత మోంకారమభిధ్యాయీత
కతమం వావ స తేన లోకం జయతీతి

శిబికుమారుడగు సత్యకాముడు పిప్పలాదముని నడిగెను. ఇచ్చట పరాపరబ్రహ్మప్రాప్తి సాధనభూతమగు ఓంకారముయొక్క ఉపాసనావిధిని తెలిసి కొనుటకొఱకు ప్రశ్న చేయబడుచున్నది. ఓ పూజ్యుడా! మనుష్యులలో ఏపురుషుడైతే ప్రాణప్రయాణపర్యన్తము ఓంకారమునే చింతన జేయునో అనగా బాహ్యావిషయములనుండి ఉపసంహరింపబడిన యింద్రియములు గలవాడై, చిత్తసమాధానముతో గూడినవాడై, ప్రణవమునందు భక్తిపూర్వకమగు బ్రహ్మభావముతో గూడి ఆత్మానుసంధానమును అవిచ్ఛిన్నముగా (ఎడతెగక) చేయుచు తదితర ప్రత్యయాన్తరాసంవలితుడై (బ్రహ్మభావము తప్ప యితరజ్ఞానము లేనివాడై) గాలిలేని దీపశిఖమాడ్కి అచంచలుడగుచున్నాడో, మఱియు "సత్య, బ్రహ్మచర్య, అహింసా౽పరిగ్రహ, త్యాగసన్న్యాస శౌచసంతోషమాయారాహిత్యము మొదలుగా గల యనేక యమ నియమాదుల అనుష్ఠించినవాడై,యీ ప్రకారముగా జీవిత పర్యంతము ఓంకారోపాసన జేయుచున్నాడో, అట్టి జ్ఞాని "కతమం వావ" ఏ ఏలోకములను బొందుచున్నాడు? జ్ఞానముచేతను, కర్మముచేతను బొందుటకు యోగ్యములగు అనేకలోకములు గలవు. వాటిలో ముందు చెప్పిన రీతిగా యనుష్ఠించు ఓంకారోపాసకుడు ఏలోకమును బొందు చున్నాడు?

53\. మం॥ తస్మై స హోవాచ ఏతద్వై సత్యకామ
పరం చాపరం చ బ్రహ్మయదోం కారః
తస్మాద్విద్వానేతేనైవాయతనేనైకతరమన్వేతి ॥

ఈ ప్రకారము ప్రశ్న చేసిన సత్యకాముని కొఱకు పిప్పలాదుడు చెప్పెను. "ఏతద్వై సత్యకామ" ఓ సత్య కాముడా! ఈ బ్రహ్మము పరమనియు, అపరమనియు యిరు తెరంగులై బరగు చున్నది. పరమనగా సత్యమై, అక్షరమై, పురుషుడను పేరు గలది యునై ఏ పరబ్రహ్మము (నిర్గుణ బ్రహ్మము) చెప్పబడుచున్నదో అదియే పరము, అపరమనగా మొట్టమొదట పుట్టినవాడును, ప్రాణ మనే పేరు గలవాడు నెవడో (సగుణబ్రహ్మము) ఆ బ్రహ్మము అపరమని ప్రసిద్ధి కెక్కెను. ఈ పరాపర బ్రహ్మములు రెండు ఓంకారస్వరూపములే, ఎందుకనగా ఓంకారమే ప్రతీకముగా (అవయవ ముగా) గలవగుటవలన యథార్థమగు ఏ పరబ్రహ్మము గలదో అది శబ్దాదులవే తెలియబడునదిగాదు. సమస్తధర్మ విశేషముల చేతను విడువబడినది, ఇట్టి యింద్రియాతీత బ్రహ్మము మనస్సు చేతనే తెలిసికొనుటకు సాధ్యపడదు. విష్ణ్వాది విగ్రహములు ఏలా గున పూజింపబడినవై పరమాత్మానుగ్రహపాత్రునిగా చేయుచున్నవో ఆ విధముగానే ప్రణవమున్ను, భక్తి శ్రద్ధలతో, బ్రహ్మ భావముతోడి ధ్యానించువారలకు పరమాత్మానుగ్రహమును గలుగ జేయు చున్నది. ఇదంతయు శాస్త్రప్రమాణసిద్ధమేను. అందువలన పరాపర బ్రహ్మము లకు రెంటికి యీ ఓంకారము యుపచారముగ (ప్రతీకముగ) అనగా ప్రతిమాస్థానీయముగ నున్నది. అందువలన విద్వాంసుడు ఆత్మప్రాప్తి సాధనభూతమగు ఓంకారధ్యానముచేత పరమునుగాని, అపరమునుగాని పొందుచున్నాడు. ఈ ప్రణవమే పరబ్రహ్మప్రాప్తికి సమీపవర్తియగు ఆలంబనము.

"యోయదిచ్ఛతి తస్య తత్"

54\. మం॥ సయద్యేకమాత్రమభిధ్యాయీత. సతేనైవ
సంవేదితస్తూర్ణమేవ జగత్యామభిసంపద్యతే ।
తమృచో మనుష్యలోకముపనయన్తే, సతత్ర
తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సంపన్నో
మహిమానమనుభవతి ॥

ఏ పురుషుడు ప్రణవముయొక్క సమస్తమాత్రల విభాగమును గురు తెలుంగనివాడైనను, ప్రణవచింతనా ప్రభావముచే, యుత్కృష్టగతినే పొందుచున్నాడు. ఇట్టి ఓంకారమునే శరణు పొందినవాడు కర్మ విషయములోను లేక జ్ఞానవిషయములోను అసంపూర్ణతచే కొన్ని దోషములతో కూడుకొన్నవాడైనను, వానికి "న హి కల్యాణకృత్ కశ్చిద్దుర్గతిం తాతగచ్ఛతి" యన్నట్లు యొకప్పుడు కూడా దుర్గతియే లేదు. అట్లైనచో అట్టివాడెట్టి ఫలమును బొందును? ప్రణవముయొక్క ఏకమాత్రావిభాగమును తెలిసికొని కేవలము ఏకమాత్రనే సర్వదా ధ్యానించువాడు ఆ ఏకమాత్రతో కూడుకొన్న ప్రణవధ్యానముచేతనే "సంవేదితః"-బాగుగా బోధింపబడినవాడై శీఘ్రములోనే భూలోకమును బ్రవేశించు చున్నాడు. లోకములో యనేకజన్మములు సంభవించుచున్నవి గదా, వాటిలో అట్టి సాధకుని ఋఙ్మంత్రములు మనుష్యలోకమునే బొందించుచున్నవి. ఆ ఓం కారోపాసనచేత ఆ సాధకుడు యీ మనుష్యజన్మములో బ్రహ్మ జ్ఞానులలో శ్రేష్ఠుడై మంచితపస్సు చేతను. నైష్ఠికబ్రహ్మచర్యము చేతను, దృఢమగు శ్రద్ధతోను కూడుకొన్నవాడై, "మహిమాన మనుభవతి" విభూతి (ఆత్మజ్ఞాన సమృద్ధిని) ననుభవించు చున్నాడు. ఆత్మజ్ఞాని యగుననుట. కనుక యోగభ్రష్టుడు యొకపుడుగూడ దుర్గతిని పొందడు.

55. మం॥ అథ యది ద్విమాత్రేణ మనసి సంపద్యతే
సోఽంతరిక్షం యజుర్భిరున్నీయ తే సోమలోకమ్ ।
స సోమలోకేవిభూతి మనుభూయపునరావర్తతే ॥

ఇచట ద్విమాత్రావిశిష్ట ఓంకారోపాసనా ఫలము చెప్పబడుచున్నది. ఎవడు ద్విమాత్రావిభాగములను బాగుగా తెలిసి ద్విమాత్రతో కూడిన ఓంకారమును ధ్యానించునో అట్టి యుపాసకుడు స్వప్నరూపమైన మననాత్మకమైన చంద్రదేవతయే యధిపతిగా గల యజుర్వేదరూపమగు మనస్సునందు "సంపద్యతే" స్థితిని పొందుచున్నాడు. అనగా ఏకాగ్రచిత్తుడై ఆత్మను భావించుచున్నాడు. ఇట్టి యుపాసకుడు మరణించిన తరువాత అంతరిక్షమే యాధారముగాగల ద్వితీయ మాత్రారూపమైన సోమలోకమును, యజుర్వేదమంత్రముల చేత పొందింపబడుచున్నాడు. అట్టివానికి యజుర్మంత్రములే సోమలోక సంబంధమగు జన్మను కలుగజేయుచున్నవి. అద్విమాత్రోపాసకుడు చంద్రలోకములోని సుఖములను బొంది తిరుగా మనుష్యలోకమునకు వచ్చుచున్నాడు.

56. మం॥ యః పునరేతం త్రిమాత్రేణోమిత్యే-
తేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత,
స తేజసి సూర్యే సంపన్నః యథాపాదో-
దరస్త్వచా వినిర్ముచ్యత, ఏవం హవైస
పాప్మనా వినిర్ముక్తః, ససామభిరున్నీయతే
బ్రహ్మలోకం, స ఏతస్మాజ్జీవఘనాత్పరాత్పరం
పురిశయం పురుషమీక్షతే, తదేతౌ శ్లోకౌ
భవతః ॥

త్రిమాత్రలు గల ఓంకారమును యుపాసించునట్టి ఏ సాధకుడు త్రిమాత్రలకు గోచరమైన జ్ఞానముతో కూడుకొని అక్షరమగు ప్రతీకమైన ఓంకారముచేత "పరం పురుషం" పరమపురుషుని (సూర్యమండలాంతర్గతుని) యుపాసించునో, వాడు, యీ ఓంకారము ప్రతీకమగుటచేత "పరం చాపరం చ బ్రహ్మయదోంకారః" యని యభేద శ్రుతిచేతను ఓంకారమునకు సర్వదా సాధనత్వము నిష్పన్నమైనది. (సిద్ధించినది.) కాన త్రిమాత్రా స్వరూపమగు ప్రణవధ్యానముచేత తృతీయ మాత్రారూపమగు సూర్యుని యందు స్థితిగలవాడగుచున్నాడు. అనగా సూర్యుని ధ్యానించువాడనుట, మరణించిన తరువాత సూర్యలోకమునే పొందుచున్నాడు.చంద్రలోకమును బొందినవానివలె తిరుగా రాడు. సర్పము ఏ విధముగా జీర్ణమైన తన చర్మమును వదలి (కుబుసమువదలి) మఱల క్రొత్తదిగ యెటులగుచున్నదో అటులనే ముందు చెప్పబడిన యుపాసకుడు "పాప్మనా" కుబుసముతో సమానమగు యశుద్ధ వాసనచేత విడువబడినవాడై, తృతీయమాత్రా రూపములైన సామ మంత్రములచే బ్రహ్మలోకమును బొందింపబడుచున్నాడు. ఆ హిరణ్యగర్భుడు సమస్తజీవులకు యాత్మభూతుడు. ఆ అంతరాత్మ సమస్తభూతములలో సూక్ష్మముగ నున్నాడు. అట్టి హిరణ్యగర్భునియందు సకలజీవులున్నవి. కనుక జీవఘనుడని చెప్పబడియె. "జీవఘనాత్" హిరణ్య గర్భునికంటె "పరాత్పరం" పరమాత్మ యనే పేరుగల పురుషుని సమస్త శరీరములలో ప్రవేశించిన వానినిగా తృతీయ మాత్రోపాసకుడెఱుంగుచున్నాడు. పైజెప్పబడిన యర్థముల ప్రకాశింప చేయునట్టి శ్లోకములు రెండు మంత్రములని యెఱుంగ వలయును.

57. మం॥ తిస్రోమాత్రా మృత్యుమత్యః
ప్రయుక్తా అన్యోన్యసక్తా అనవిప్రయుక్తాః ।

క్రియాసు బాహ్యాభ్యంతరమధ్యమాసు
సమ్యక్ ప్రయుక్తాసు న కంపతేజ్ఞః ॥

ఇచ్చట ఓంకారమాత్రలయొక్క విశేషము వర్ణింపబడుచున్నది, ప్రణవముయొక్క మాత్రలగు అకార, ఉకార, మకారములు మూడున్ను మృత్యుగోచరములై యున్నవి. అనగా ముందు చెప్పిన మూడు మంత్రముల రీతిగా అకార, ఉకార, మకారోపాసకులు సంసారభూతములగు భూలోక, చంద్రలోక, బ్రహ్మలోకములను బొందుచున్నారు, ఆ లోకాధిష్ఠానదేవతలున్ను యుపాధితోకూడుకొన్నవారలే. ఆ దేవతలు అపరబ్రహ్మమని చెప్పబడుచున్నవి. ఆ మూడు మాత్రలు పరస్పరము కలిసియున్నవి. మఱియు నవి అనభిప్రయుక్తములుగనున్నవి. "అనవిప్రయుక్తాః"-విశేషముగా ప్రయోగింపబడినవి విప్రయుక్తములనంబడును. విప్రయుక్తములుకానివి అవిప్రయుక్తములు. అనగా విశేషముగ ప్రయోగింపబడనివియనుట. అవి కానివి అనవిప్రయుక్తములు. ఇటుల చెప్పినందుచే బాగుగా ప్రయోగింపబడినవి బాగుగా నొక దానియందే ప్రయోగింపబడునవి యని అర్థము సిద్ధించినది. ఇట్లుచెప్పుటచే ఏమి ఫలితార్థము? ధ్యానకాలమునందే జాగ్రత్స్వప్న సుషుప్తిస్థానములయొక్క (విశ్వతైజస ప్రాజ్ఞులయొక్క) చింతనారూపములగు బాహ్యాభ్యంతర మధ్యమ క్రియలు విశేషముగా ప్రయోగింపబడగా అట్టి యోగీశ్వరుడు చలించడు. పూర్వము జెప్పిన రీతిగా ఓంకారముయొక్క విభాగమును గుర్తెఱిగి చలనత్వమును పొందడు. (ధ్యానమునుండి చలింపడనుట) ఉత్కృష్టగతినే పొందును. ఎందువలననగా జాగ్రత్ స్వప్నసుషుప్త్యవస్థాభిమాని దేవతలగు విశ్వతైజస ప్రాజ్ఞులను మాత్రాత్రయరూపమగు ఓంకారోపాసనచేత సాక్షాత్కరించుచున్నాడు. అనగా ఓంకారస్వరూపునిగా చూచుచున్నాడు. ఇట్టి ఓంకారోపాసకునకు యుత్కృష్టగతియేగాని చలనగతిలేదు.

58. మం॥ ఋగ్భిరేతం యజుర్భిరంతరిక్షం
సామభిర్యత్తత్కవయో వేదయన్తే।
తమోంకారేణైవాయతనేనాన్వేతి విద్వాన్
యత్తచ్ఛాన్తమజరమమృతమభయంపరంచేతి

ఋఙ్మంత్రములచేత మనుష్యలోకమును, యజుర్వేద మంత్రములచేత సోమాధిష్ఠితమగు అంతరిక్షమును (సోమలోకమును.) సామమంత్రములచేత మూడవదగు బ్రహ్మలోకమును, కవయః=మేధావంతులగు విద్వాంసులు తెలిసికొనుచున్నారు. అనగా అపరబ్రహ్మస్వరూపమగు యీ మూడులోకములను ఓంకారరూప సాధనముచేతనే విద్వాంసులు పొందుచున్నారు, అట్టి ఓంకారముచేతనే (ఓంకారచతుః పాదవిభాగజ్ఞానముచేతనే) సత్యమై, పరమై, అక్షరమై, శాంతమై, విముక్తమైనట్టియు, జాగ్రత్ స్వప్నసుషుప్త్యాది విశేషసర్వప్రపంచముచేత విడువబడినది కనుకనే అజరం = జరావస్థలేనిదియు, అమృతం= మరణములేనిదియు, ఇందువలననే జరావిక్రియ రహితమున్ను, భయవర్జితమున్ను, అందువలననే నిరతిశయమైనట్టి పరబ్రహ్మమును, "ఓంకారేణ ఆయతనేన" ప్రణవరూపమార్గముచేత పొందుచున్నాడు, ఈ ప్రకారముగ ప్రశ్నోపనిషత్తు యుద్బోధించుచున్నది.

—: అథ బ్రహ్మోపనిషత్ :—

59. మం॥ ఆత్మానమరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిం।
ధ్యాననిర్మథనాభ్యాసాద్దేవం పశ్యేన్నిగూఢవత్ ॥

ఆత్మను క్రింది అరణిగాను, ప్రణవమును మీది అరణిగాను జేసి ధ్యానమనెడి మథనాభ్యాసమువలన రహస్యమగు పరబ్రహమును సాధకుడు గుర్తెఱిగుచున్నాడు.

—: అథ గర్భోపనిషత్ :—

60. మం॥ సమ్యగ్ జ్ఞానాద్ధ్యానాత్ అక్షరమోంకారం ।
చిన్తయతి తదేవ ప్వైకాక్షరం జ్ఞాత్వాష్టౌ ॥

గర్భములోని శిశువునకు యెనిమిది మాసములు రాగానే వానికి పూర్వజ్ఞానముండుటవలనను, ధ్యానమువలన అక్షరమైన ఓంకారమునే జింతించుచున్నాడు. అట్టి అక్షరమగు పరబ్రహ్మాను తెలిసికొనుచున్నాడు.

—: అమృతనాదోపనిషత్ :—

61. మం॥ అఘోషమవ్యంజనమస్వరం చ
యత్తాలుకంఠోష్ఠమనాసికం చ యత్ ।
అరేఫజాతముభయోష్మవర్జితం
యదక్షరం నక్షరతే కథం చిత్ ॥

ఈ ప్రణవము అఘోషం = ఘోషప్రయత్నము లేనిది. అనగా హల్లులు=హ, య, వ, ర, ల, జ. మ, ఞ, ణ, న, ఝ, భ, ఘ ఢ, ధ, జ, బ, గ, డ, ద యీఅక్షరములకంటె భిన్నమైనదియు, హల్లు, అచ్చు కానిదియు, తాలు స్థానీయములగు ఇకార, చవర్గ, యకార, శకారములలో చేరనిదియు, నాసికాక్షరములగు ఙ, మ, ఞ, ణ, న వీటికంటె వేఱైనదియు, రేఫమువలన కలుగనిదియు, సంధ్యక్షరములు ఆ, ఏ, ఐ, ఓ, ఊష్మలు, శ, ష, స, హ వీటికంటె విలక్షణమైనదియు నగుచున్నది. పైజెప్పబడిన అక్షరములన్నియు హల్లనిగాని, అచ్చనిగాని విభాగము చేయుటకు వీలగుచున్నది. ఈ ప్రణవమో; అటుల విభజించుటకు సాధ్యముగాదు. అక్షరములన్నియు నాయాస్థానములందు కలుగుచున్నవని చెప్పుటచే, అవి యన్నియు క్షరభావమును పొందు

చున్నవి. ఈ ప్రణవము ఏ స్థానమునుండియు కలుగుచున్నదని చెప్పుటకు వీలులేనందుచే అక్షరమయ్యేయున్నది. వర్ణములన్నియు అక్షరమగు ప్రణవమునుండియే జనించినందువలన వాటికన్నిటికి అక్షరత్వము సిద్ధించినది.

62. మం॥ యేనాసౌగచ్ఛతే మార్గం ప్రాణ స్తేనాభిగచ్ఛతి।
అత స్తమభ్యసేన్నిత్యం యన్మార్గగమనాయవై ॥

ప్రణవధ్యానము చేయు యోగి ఏ అర్చిరాది మార్గమును బొందునో ప్రాణముగూడ యామార్గముననే బోవును, కనుక యాయర్చిరాది మార్గముకొఱకు (తిరుగరాకుండుటకొఱకు) ఆప్రణవాభ్యాసమునే నిత్యము చేయుచుండవలయును.

—: కఠోపనిషత్ :—

మం॥ అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాదన్య -
త్రాస్మాత్కృతాకృతాత్ ।
అన్యత్ర భూతాచ్చభవ్యాచ్చ
యత్తత్పశ్యతి తద్వద ॥

శాస్త్రీయ ధర్మానుష్ఠానము, తత్ఫలము, కర్తృ కారకాదులు వీటికంటెను విలక్షణమైనదియు, అటులనే యధర్మముకంటె వేఱైనదియు "కృతాకృతాత్" కృత మనగా కార్యము అకృతమనగా కారణము. ఈ కార్యకారణముకంటెను,

"కార్యోపాధిరయం జీవః కారణోపాధి రీశ్వరః ।
కార్యకారణతాంహిత్వా పూర్ణబోధోఽవశిష్యతే"

అన్నట్లు విభిన్నమైనదియు, భూతభవిష్యద్వర్తమానముకంటె అతీతమైనదియు, సమస్త వ్యవహారములకు యగోచరమైనదియు (నీవు

నేననెడి భేదజ్ఞానములకు) విషయము కానట్టి ఏ పర్రబహ్మమును తెలియుచున్నావో. యోగ్యుడనై ననాకు అర్థానిని దెలియజేయుము. అని నచికేతుడు యమధర్మరాజును ప్రశ్నించెను.

ఓం కా రో ప దే శ ము

యమధర్మరాజు సాధనచతుష్టయసంపత్తిగల యుత్తమాధికారి యగు నచికేతునికి ఉపదేశించిన యమూల్యమైన ప్రణవోపాసన ప్రతిపాదింపబడుచున్నది.

63. మం॥ సర్వేవేదాయత్పదమామనన్తి
తపాంసి సర్వాణి చ యద్వదన్తి।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తేపదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్ ॥

సమస్తవేదములు ఏకమైన ప్రాప్యమగు ముఖ్యస్థానముగా నెద్దానిని చెప్పుచున్నవో, సమస్తతపస్సులేస్థానమును బొందదగిన వస్తువునుగా బోధించుచున్నవో, ఏ యగమ్యగోచరమగు విషయమును వాంఛించినవారలై గురుకులవాసాది లక్షణయుతమైన బ్రహ్మచర్యమును అనుష్ఠించుచున్నారో (ఆత్మారామునియందు రమించుచున్నారో) అట్టి పర్రబహ్మమును సంగ్రహముగా చెప్పుచున్నాను. ఓమితి=ఓమని అట్టి పర్రబహ్మము ఓంకారశబ్దవాచ్యముగాను, ఓంకారశబ్దమే ప్రతీకముగా గలదిగాను నున్నది.

64. మం॥ ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరంపరమ్ ।
ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య
తత్ ॥

ఈ యక్షరమైన ప్రణవమే యపర్రబహ్మము, (సగుణము) ఈ అక్షరమగు ఓంకారమే పరము (నిర్గుణ బ్రహ్మము) ఈపరాపర్రబహ్మల రెండింటికి యీ ఓంకారమే ప్రతీకమనుట. ఈయక్షరమైన యుపాస్యమగు బ్రహ్మమును గుర్తెఱింగి ప్రణవముచేత యెవరు యుపాసించుచున్నారో ఆ సాధకులు యిష్టమైన పరమునుగాని, యపరమునుగాని బొందుచున్నారు. (వారు దేనిని గుఱించి సంకల్పించుదురో ఆ ఫలములన్నియు ఫలించును.)

65. ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరమ్ ।
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥

బ్రహ్మస్థానమును బడయగోరువారికి యీ ప్రణవమే శ్రేష్ఠము. అనగా ప్రశంసింపదగిన యాధారము. "నాన్యః పంథా విద్యతేఽయనాయ" యన్నట్లు ఇంతకన్న వేరే మార్గములేదు. పరాపర్రబహ్మలకు నిదియే (ప్రణవమే) అలంబనము. ప్రణవరూపమగు అత్యుత్తమమైన యాధారమును దెలిసికొన్నవాడు "బ్రహ్మలోకే మహీయతే" పర్రబహ్మమునందుంటున్నవాడై అపార మహిమాన్వితుడగుచున్నాడు. బ్రహ్మవిత్ బ్రహ్మవిదేవ భవతి" యను శ్రుతి చొప్పున యాసాధకుడు బ్రహ్మమును తెలిసికొని బ్రహ్మవేత్తె బ్రహ్మమే యగుచున్నాడు. ఈ ప్రకారముగ కఠోపనిషత్తు బోధించుచున్నది.

:—అథ నాదబిందూపనిషత్—:

ప్రణవమే హంసరూపముగా చెప్పబడుచున్నది.

66॥ మం. అకారో దక్షిణః పక్ష, ఉకారస్తూత్తరస్స్మృతః
మకారం పుచ్ఛమిత్యాహు, రర్ధమాత్రాతు
మస్తకమ్ ।

పాదాదికం గుణాస్తస్య శరీరం తత్త్వముచ్యతే
ధర్మోఽస్య దక్షిణం చక్షురధర్మోఽథోఽపర
స్స్మృతః॥

ప్రణవమను హంసపక్షికి అకారము దక్షిణ పార్శ్వపు రెక్కగాను, ఉకారము యుత్తర పార్శ్వపు రెక్కగాను జెప్పబడినది. మకారమును తోకగాను, అర్ధమాత్రను శిరస్సుగాను నుడివిరి. శరీరము తత్త్వముగాను చెప్పబడెను. ఆ ప్రణవపక్షికి గుణములు, పాదములు మొదలుగా గలవి. కుడినేత్రము ధర్మము, ఎడమనేత్రము అధర్మమనియు చెప్పబడెను.

67॥ మం॥ భూర్లోకః పాదయోస్తస్య భువర్లోకస్తుజానునీ ।
సువర్లోకః కటీదేశే నాభిదేశే మహర్జగత్ ॥
జనోలోకస్తు హృద్దేశే కంఠే లోకస్తపస్తతః ।
భ్రువోర్లలాటమధ్యేతు సత్యలోకో వ్యవస్థితః ॥
సహస్రారమతీవాత్ర మంత్ర ఏష ప్రదర్శితః ।
ఏవమేతాం సమారూఢో హంసయోగ విచక్షణః ॥

భూలోకము పాదములు, భువర్లోకము జానువులు, సువర్లోకము కటిప్రదేశములు, మహర్లోకము నాభి ప్రదేశము, జనలోకము హృదయము, తపోలోకము కంఠము, సత్యలోకము లలాటమధ్యప్రదేశము. ఈ ప్రకారముగా ప్రణవహంసపక్షి యొక్క యవయవములు చెప్పబడినవి. ఈ ప్రణవమంత్రము సహస్రారములో వ్యాపించియున్నది. హంస యోగి యీ ప్రణవపక్షిని వాహనముగా జేసికొని పరబ్రహ్మ ప్రాప్తిరూప గమనము చేయుచున్నాడు. మఱియు బ్రహ్మదేవునికి హంసపక్షి వాహనమని చెప్పెడు

రహస్యమిది. అనగా యీ ప్రణవమగు హంసను యాధారము చేసికొని చతుర్ముఖబ్రహ్మ పరబ్రహ్మమును బొందుచున్నాడు.

68. మం॥ నభిద్యతే కర్మచారైః పాపకోటిశతైరపి ।
ఆగ్నేయీ ప్రథమా మాత్రా వాయవ్యేషా
తథా పరా ॥
భానుమండలసంకాశా భవేన్మాత్రా తథోత్తరా ।
పరమాచార్ధమాత్రాయావారుణీం తాం విదుర్బుధాః॥
కాలత్రయేఽపి యస్యేమా మాత్రాసూనం ప్రతిష్ఠితాః
ఏష ఓంకార ఆఖ్యాతో ధారణాభిర్నిబోధత॥

ఇట్టి ప్రణవోపాసకునికి యనేక పాపకర్మలు నశించుచున్నవి. ఆ సాధకుడు కర్మలచేత బంధింపబడడు. ఈ ప్రణవము యొక్క ప్రథమ మాత్ర ఆగ్నేయి యనియు, రెండవ మాత్ర వాయవ్యియనియు, మూడవది సూర్యమండలముతో సమానమైనదనియు, మిగిలిన యర్ధమాత్ర పరమమై వారుణి యనియు పండితులు చెప్పుచున్నారు. మూడు కాలములలోను దేనికైతే యీమాత్రలు స్థిరములై యున్నవో యదియే ఓంకారముగ చెప్పబడెను. ఈవిషయము ధారణాశక్తిచేత తెలిసికొనవలయును.

69. మం॥ ఘోషిణీ ప్రథమామాత్రా విద్యున్మాత్రా
తథాపరా ।
పతంగినీ తృతీయాస్యా చ్చతుర్థీ వాయువేగినీ॥
పంచమీ నామధేయాతు షష్ఠీ చైంద్ర్యభిధీయతే।
సప్తమీవైష్ణవీనామ అష్టమీ శాంకరీతి చ॥

నవమీ మహతీనామ ధృతిస్తు దశమీ మతా।
ఏ కాదశీ భవేన్నారీ బ్రాహ్మీతు ద్వాదశీ పరా ॥

ప్రణవముయొక్క ద్వాదశమాత్రలు (పండ్రెండు మాత్రలు) వివరింపబడుచున్నవి.

(1) ఘోషిణీ, (2) విద్యున్మాత్ర, (3) పతంగిని (4) వాయువేగిని. (5) నామధేయ, (6) ఐంద్రి, (7) వైష్ణవి, (8) శాంకరి, (9) మహతి, (10) ధృతి, (11) నారి, (12) బ్రాహ్మి.

70. మం॥ ప్రథమాయాం తు మాత్రాయాం యదిప్రాణై ర్వి యుజ్యతే ।
భరతే వర్షరాజాఽసౌ సార్వభౌమః ప్రజాయతే॥
ద్వితీయాయాం సముత్క్రాన్తో భవేద్యక్షో మహాత్మవాౕ ।
విద్యాధర స్తృతీయాయాం గాంధర్వస్తు చతుర్థికా॥
పంచమ్యా మథ మాత్రాయాం యది ప్రాణై ర్వి యుజ్యతే ।
ఉషిత స్సహ దేవత్వం సోమలోకే మహీయతే॥
షష్ఠ్యామింద్రస్య సాయుజ్యం స ప్తమ్యాం వైష్ణవం పదమ్ ।
అష్టమ్యాం వ్రజతేరుద్రం పశూనాం చ పతింతథా॥
నవమ్యాం తు మహర్లోకం దశమ్యాం తు జనం వ్రజేత్ ।
ఏకాదశ్యాం తపోలోకం ద్వాదశం బ్రహ్మ శాశ్వతమ్ ।

ఇక ద్వాదశమాత్రలయొక్క ఫలితమును వేఱువేఱుగా చెప్పుచున్నారు. ప్రథమమాత్రోపాసకుడు మరణించిన తరువాత భరతవర్షములో సార్వభౌముండై పుట్టుచున్నాడు. ద్వితీయమాత్రోపాసకుడు శరీరమును విడిచినవాడై మహా మహిమశాలియగు యక్షుడగుచున్నాడు తృతీయ మాత్రోపాసకుడు ప్రాణము విడిపోయిన తరువాత విద్యాధరుడగుచున్నాడు. చతుర్థమాత్రోపాసకుడు గంధర్వుడగుచున్నాడు.పంచమమాత్రోపాసకుడు మృతిపొందిన తరువాత దేవత్వమును బొంది చంద్రలోకములో పూజ్యుడగుచున్నాడు. ఆఱవమాత్రనుపాసించువాడు ఇంద్రునియొక్క సాయుజ్యమును, ఏడవమాత్రనుపాసించువాడు వైష్ణవస్థానమును,అష్టమ మాత్రోపాసకుడు రుద్రుని, నవమమాత్రోపాసకుడు మహర్లోకమును, పదియవ మాత్రోపాసకుడు జనలోకమును, ఏకాదశమాత్రోపాసకుడు తపోలోకమును, ద్వాదశ మాత్రోపాసకుడు బ్రహ్మపదవిని, దేహమును విడిచిన తరువాత (వీరలు) పొందుచున్నారు.

71. మం॥ తతః పరతరం శుద్ధం వ్యాపకం నిర్మలం శివమ్
సదోదితం పరం బ్రహ్మజ్యోతిషాముదయోయతః।
అతీన్ద్రియం గుణాతీతం మనోలీనం యథాభవేత్;
అనుపమం శివం శాన్తం యోగయుక్తం సదా విశేత్ ॥

తద్యుక్త స్తన్మయో జన్తుఃశనైర్ముంచేత్ కళేబరమ్।
సంస్థితో యోగచారేణ సర్వసంగవివర్జితః ॥
తతో విలీనపాశోఽసౌ విమలః కమలాప్రభుః।
తేనైవ బ్రహ్మభావేన పరమానందమశ్నుతే ॥

ఎప్పుడు మనస్సు లీనమగునో యప్పుడు, యోగయుక్తు డైనవాడు (ప్రణవానుసంధానము చేయువాడు) శ్రేష్ఠతరమైనదియు, శుద్ధమైనదియు, వ్యాపకమును, నిర్మలమును, శివమును, సర్వదా యుదయమును బొందినదియు, సమస్త జ్యోతిస్సులయొక్క యుత్పత్తికి కారణమును, పరబ్రహ్మయు,ఇంద్రియములను, గుణముల నతిక్రమించినదియు, సాటిలేనిదియు, మంగళస్వరూపమైనదియు, శాన్తము నగు పరమాత్మను యెల్లప్పుడు పొందుచున్నాడు. అట్టి ప్రణవానుసంధానముతో కూడుకొనినవాడు పరబ్రహ్మ స్వరూపుడై మెల్లగా శరీరము విడుచును. సర్వసంగవివర్జితుడై ప్రణవయోగమును శీలించినవాడు మరణానంతరము సంసారరహితుండై, విష్ణుస్వరూపుడై ఆ బ్రహ్మభావముచే పరమానందమును బొందుచున్నాడు.

72. మం॥ బ్రహ్మప్రణవసంధానం నాదోజ్యోతిర్మయశ్శివః ।
స్వయమావిర్భ వేదాత్మా మేఘాపాయేఽంశు
మానివ ॥
సిద్ధాసనేస్థితో యోగీముద్రాం సంధాయవైష్ణవీం।
శృణుయాద్దక్షిణే కర్ణే నాదమన్తర్గతం సదా ॥
అభ్యస్య మానోనాదోఽయం బాహ్యమావృణుతే
ధ్వనిః ।
పక్షాద్విపక్ష మఖిలం జిత్వాతుర్యపదం వ్రజేత్॥
శ్రూయతే ప్రథమాభ్యాసే నాదోనానావిధో
మహాన్ ।
వర్ధమానేతథాభ్యాసే శ్రూయతే సూక్ష్మ
సూక్ష్మతః ॥

ఆదౌ జలధిజీమూత భేరీనిర్ఝరసంభవః ।
మధ్యే మర్దలశబ్దాభో ఘంటాకాహలజస్తథా ॥
అన్తేతు కింకిణీవంశవీణాభ్రమరనిస్స్వనః ।
ఇతి నానావిధా నాదాః శ్రూయన్తే సూక్ష్మసూక్ష్మతః॥
మహతి శ్రూయమాణే తు మహాభేర్యాదికధ్వనౌ ।
తత్రసూక్ష్మం సూక్ష్మతరం నాదమేవ పరా-
మృశేత్ ॥
ఘనముత్సృజ్య వా సూక్ష్మే సూక్ష్మముత్సృజ్యవా
ఘనే ।
రమమాణమపిక్షిప్తం మనోనాన్యత్రచాల యేత్ ॥
యత్రకుత్రాపి వా నాదే లగతి ప్రథమం మన ।
తత్ర తత్ర స్థిరీభూత్వాతేన సార్ధం విలీయతే ॥
విస్మృజ్యసకలం బాహ్యం నాదే దుగ్ధాంబువన్మనః ।
ఏకీభూయాథ సహసా చిదాకాశే విలీయతే ॥
ఉదాసీనస్తతోభూత్వా సదాభ్యాసేన సంయమీ ।
ఉన్మనీకారకం సద్యో నాదమేవావధారయేత్ ॥

ప్రణవనాద బ్రహ్మోపాసన చెప్పబడుచున్నది. ఈ యుపాసన చేయువాడు ప్రణవశబ్దమందే మనస్సును లయింపచేసినచో, శీఘ్రముగా చిత్తైకాగ్రత కలిగి అంతరాత్మయందే క్రీడించుచున్నాడు, మేఘములు పోగా సూర్యుడేవిధముగా స్వయముగానే ప్రకటమగునో, యావిధముగ బ్రహ్మమునందు ప్రణవానుసంధానముచే గలిగెడు నాద స్వరూపమైనట్టియు, జ్యోతిస్స్వరూపమైన శివమైన ఆత్మ ఆవరణము తొలగగానే, తనంతట తానే ప్రకాశించు

చున్నది. యోగీశ్వరుడు సిద్ధాసనమందున్నవాడై, వైష్ణవ ముద్రను ధరించి, కుడిచెవిలో అంతర్గతమైన ప్రణవధ్వనిని యెల్లప్పుడు వినవలయును. ఈవిధముగా అభ్యసింపబడిన నాదము, బాహ్య ధ్వనిని ప్రకటించును. అనగా బాహ్యమునందుకూడా స్పష్టముగా వినబడుననుట. తరువాత సకల ప్రతిబంధములను విడనాడి, యా నాదము తురీయపదమును జేరును. (సహస్రారమును జేరును) ప్రథమాభ్యాసకునికి యనేకవిధములైన గొప్ప గొప్ప ధ్వనులు వినబడును. అభ్యాసము చేయగా చేయగా మొదట వృద్ధిపొందినదై ఆ నాదము సూక్ష్మసూక్ష్మముగా వినబడును. మొదట సముద్రము. మేఘము, భేరీ, ప్రవాహము వీటివలన కలిగెడు ధ్వని వినబడును, మధ్యకాలములో మృదంగశబ్దమువంటి శబ్దము. ఘంటానాదము. కాహలధ్వని యివి వినబడును. అంతములో గజ్జెలు, ఏకనాదము (తాంబుర) వీణా. తుమ్మెదలు వీటిధ్వని వినబడుచున్నవి. ఈవిధముగా ననేకసూక్ష్మమైన ధ్వనులు వినబడుచున్నవి. గొప్పదగు భేర్యాది ధ్వనులు వినబడగా ఆ ధ్వనులలో సూక్ష్మమైనట్టియు. మిక్కిలి సూక్ష్మమైనట్టియు, నాదమునే గ్రహించవలయును. గొప్ప ధ్వనిని వదలి. సూక్ష్మధ్వనియందును. సూక్ష్మధ్వనిని త్యజించి, మహాధ్వనియందును మనస్సు నుంచినచో అది అక్కడనే రమించు చున్నదై కొంచముకూడా చలించదు. మొదట మనస్సు యేదోయొక నాదములో సంబంధించును. ఆ నాదములోనే స్థిరముగా నుండి నాదముతోకూడా మనస్సున్ను లయించును. బాహ్యప్రపంచము సమస్తమున్ను మరచి క్షీరములో జలమువలె ప్రణవనాదమునందు మనస్సు లయించి శీఘ్రముగ చిదాకాశములో లయమగుచున్నది. ఈప్రకారముగా సదా అభ్యసించు యోగి యుదాసీనుండై దేనిని యంటనివాడై మనస్సును లయింపజేయునటువంటి నాదమునే శీఘ్రముగ ధారణజేయును.

73. మం॥ సర్వచింతాం సముత్సృజ్య సర్వచేష్టావివర్జితః ।
నాదమేవానుసందధ్యాన్నాదే చిత్తం విలీయతే ॥

ప్రణవనాదోపాసకుడు సమస్తచింతలనువదలి, బ్రహ్మ భావముతో కూడుకొన్నవాడై సమస్తేంద్రియ చేష్టలనువదలి నాదమునే యనుసంధానము చేయవలయును. నాదములో మనస్సు లయించుచున్నది.

74. మం॥ మకరందం పిబన్ భృంగో గంధాన్ నాపేక్షతే యథా ।
నాదాసక్తం సదాచిత్తం విషయం నహికాంక్షతే ॥
బద్ధస్సునాద గంధేన సద్యస్సంత్యక్తచాపలః ।
నాదగ్రహణతశ్చిత్తమన్తరంగ భుజంగమః ।
విస్మృత్య విశ్వ మేకాగ్రం కుత్రచిన్నహిధావతి ।
మనోన్మత్తగజేన్ద్రస్య విషయోద్యానచారిణః॥
నియామనసమర్థోఽయం నినాదో నిశితాంకుశః ।
నాదోఽన్తరంగసారంగ బంధనే వాగురాయతే ॥
అంతరంగసముద్రస్య రోధే వేలాయతేఽపివా ।
బ్రహ్మప్రణవసంలగ్ననాదో జ్యోతిర్మయాత్మకః ॥

భ్రమరము పుష్పమునందుగల మధువును త్రాగుచున్నదై, యితర గంధములను యెటుల అపేక్షించదో, అటులనే ప్రణవనాదమునందు ఆసక్తమగు మనస్సు విషయాదులను కోరదు. అంతరంగమను సర్పము మనోహరమగు నాదముయొక్క సంస్కారముచేత బంధింపబడినదై తక్షణమే సమస్త చపల స్వభావమును వదలి, ప్రణవనాదము నందే లయించుచున్నది. అందువలన యట్టి

మనస్సు ప్రపంచమును మరచి, యేకాగ్రమైనదై మఱియొక చోటికి పరుగిడదు. విషయములచే ఉద్యానములో సంచరించునట్టి మనస్సనెడి మత్తగజేంద్రమును నియమించుటలో సమర్థమైనటువంటి, తీక్ష్ణమైన అంకుశము ప్రణవధ్వనియే. చిత్తమనెడు బెగ్గురు పక్షిని బంధించుటలో, ప్రణవ నాదమే ఉచ్చు అగుచున్నది. అంతరంగమనెడి సముద్రమును యడ్డగించుటలో, ప్రణవనాదము చెలియలికట్టయగుచున్నది. బ్రహ్మస్వరూపమగు ప్రణవమునకు సంబంధించిన ధ్వని జ్యోతిస్వరూపమని చెప్పబడుచున్నది.

75. మం॥ మనస్తత్ర లయం యాతి తద్విష్ణోఃపరమంపదమ్।
తావదాకాశసంకల్పో యావచ్ఛబ్దః ప్రవర్తతే ॥
నిశ్శబ్దం తత్పరం బ్రహ్మ పరమాత్మాసమీయతే ।
నాదోయావ న్మనస్తావ న్నాదాన్తే ఽపి మనోన్మనీ॥
స శబ్దశ్చాక్షరే క్షీణే నిశ్శబ్దం పరమంపదమ్ ।
సదానాదానుసంధానాత్సంక్షీణావాసనా తు యాః
నిరంజనే విలీయేతే మనోవాయూ న సంశయః ।
నాదకోటిసహస్రాణి బిన్దుకోటిశతానిచ ॥
సర్వే తత్ర లయంయాన్తి బ్రహ్మ ప్రణవనాదకే ।
సర్వావస్థావినిర్ముక్తః సర్వచిన్తా వివర్జితః ॥
మృతవత్తిష్ఠతే యోగీసముక్తోనాత్ర సంశయః ।
శంఖదుందుభినాదంచ న శృణోతి కదాచన॥
కాష్ఠవజ్జాయతే దేహ ఉన్మన్యావస్థయా ధ్రువమ్ ।
న జానాతి స శీతోష్ణం న దుఃఖం న సుఖం తథా॥
న మానం నావమానంచ సంత్యక్త్వాతు సమాధినా।

అవస్థాత్రయ మన్వేతి న చిత్తం యోగిన స్సదా ।
జాగ్రన్నిద్రావినిర్ముక్తః స్వరూపావస్థతామియాత్॥

మనస్సు ప్రణవనాదముతో యెచ్చట లయమగునో, అదియే పరమమగు వైష్ణవపదము. అనగా ప్రాప్యమగు బ్రహ్మస్థానమనుట. "శబ్దగుణకం ఆకాశమ్" శబ్దమే గుణముగాగలది ఆకాశమని చెప్పుటచేత ఎంతవఱకు శబ్దము వినబడునో, అంతవరకు ఆకాశమనే సంకల్పములు, భావనలు యుండును. అందువలననే "భావాతీతం బ్రహ్మ" యని చెప్పబడియె. నిశ్శబ్దం బ్రహ్మ ఉచ్యతే" యనురీతిగా శబ్దము లయమునుబొందిన తరువాత శబ్దాతీతమగు పరమగుబ్రహ్మమే సిద్ధించుచున్నది. అదియే పరమాత్మయని తెలిసికొనుచున్నారు. ఎంతవఱకు నాదమున్నదో అంతవఱకు మనస్సు ప్రవర్తించుచుండును. నాదము ముగిసినతరువాత మనస్సు ఉన్మనీభావమును (పరమాత్మలో లయమగుట) పొందును. తరువాత మనస్సులేదు. కనుక యాత్మ జ్ఞానులకు మనస్సను పదార్థము వేరుగాలేదు. ఆత్మ ఒకటియే. ఆ ప్రణవ శబ్దము అక్షరపరబ్రహ్మములో లీనమగుచున్నది. నిశ్శబ్దమే పరబ్రహ్మ పదము. ఎల్లప్పుడు ప్రణవనాదాను సంధానమువలన సమస్తవాసనలు నశించును. నిరంజనమగు పరబ్రహ్మములో మనస్సు, వాయువు రెండున్ను లయమగును. ఇందు సందేహ మొండులేదు. అనేక నాదములును, అనేకబుద్ధి చలనములున్ను, బ్రహ్మప్రణవనాదములో లయ మొందుచున్నవి. అట్టి యోగి సమస్తచింతలను విడనాడి బ్రహ్మమునందే విహరించుచు సమస్త యవస్థలను (జాగ్రదాది యవస్థలను) అతిక్రమించినవాడై జీవించియుండియు మరణించినవానివలె (ప్రపంచముతోటి సంబంధములేనివాడై). సమస్తేంద్రియముల వికారము లడంగినవాడై యుండును. ఆ యోగి సర్వదా జీవన్ముక్తుడు. ఈవిషయములో సంశయములేదు. శంఖాదినినాదమును యొకానొకపుడును

వీనడు. ఉన్మనీయవస్థలో నున్నవాని దేహము కొయ్యవలెఅగును. అనగాఅట్టివానికి దేహాభిమాన మెకించుకయు లేదనుట. ఆ ధ్యాననిష్ఠుడు సుఖదుఃఖములనుగాని, శీతోష్ణములనుగాని యెఱుంగడు. మానాభిమానముల వదలి సమాధియోగముచే (బ్రహ్మమునందు చిత్తమును జేర్చుటచే) మూడవస్థల నతిక్రమించుచున్నాడు. ఆ యోగికి యెప్పుడుగాని చిత్తమనునదిలేదు (సంకల్పరహితుడగుచున్నాడు) జాగ్రదాది అవస్థలనతిక్రమించినవాడై స్వస్వరూపస్థితిని పొందుచున్నాడు. ఇటుల నాదబిందూపనిషత్తు నినాదము (ధ్వని) చేయుచున్నది.

—: అథ ధ్యానబిందూపనిషత్ :—

76. మం॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వ—
ముముక్షుభిః ॥

సమస్తయుపనిషత్తుల సారమైనటువంటి 'ఓమ్' అను ఏకాక్షరమును, బ్రహ్మభావముతోటి ముముక్షువు లందఱు ధ్యానము చేయవలయును.

77. మం॥ ఓంకారప్రభవా దేవా ఓంకారప్రభవాస్స్వరాః।
ఓంకార ప్రభవం సర్వం త్రైలోక్యం సచరాచరమ్॥

ఓంకారమునుండియే బ్రహ్మాది సమస్తదేవతలున్ను ఉద్భవించిరి. స్వరములతోకూడిన సమస్తవేదములున్ను. చరాచరాత్మకము లగు యీ మూడు లోకములున్ను ఆ ఓంకారమునుండి పుట్టినవే.

78. మం॥ హ్రస్వోదహతి పాపాని దీర్ఘస్సంపత్ప్రదో౽
వ్యయః ।
అర్ధమాత్రా సమాయుక్తః ప్రణవో మోక్షదాయకః॥

ఈ ఓంకారము హ్రస్వముగా ఉచ్చరింపబడినదై సమస్తపాతకములను నశింపజేయును. దీర్ఘముగ నుచ్చరింపబడినదై అక్షయమగు సంపత్తు నొసగును. అనగా నశింపని విజ్ఞానము గలుగునని భావము. అర్ధమాత్రయగు నాలుగవ పాదమో, సమన్వయపఱచి దాని యరమును భావములోనుంచి, ధ్యానించెడు ప్రణవము మోక్షము నొసగును.

79. మం॥ తైలధారామివాచ్ఛిన్నం దీర్ఘఘంటానినాదవత్
అవాచ్యం ప్రణవస్యాగ్రం యస్తంవేదసవేదవిత్॥

దీనివలన ధ్యానవృత్తిని గుఱించి తెలియదగును. ఎడతెగని తైలధారవలెను, గొప్పదగు ఘంట కొట్టిన తరువాత గలుగుచుండు దీర్ఘమైన ధ్వనివలెను, అవాచ్యమైన నాలుగవ పాదమగు ప్రణవముయొక్క అగ్రమును నెవడు తెలిసికొనుచున్నాడో (ధ్యానమునందు ధ్యేయాకారమగుచున్నాడో) వాడు వేదములకు సారభూతమైన ప్రణవమును, ప్రణవవాచ్యమగు పరబ్రహ్మను యెఱింగినవాడు. "నివర్తతేక్రియాస్సర్వాస్తస్మిన్ దృష్టే పరావరే" ఇటుల పరమగు పరబ్రహ్మమును గాంచగా సమస్తక్రియలు (సమస్తప్రవృత్తులు) నశించును. తదేకరూపుడగుచున్నాడని భావము. ఈ ప్రకారముగా ధ్యానబిందూపనిషత్తు తెలియజేయుచున్నది.

—: అథ అథర్వశిర ఉపనిషత్ :—

80 మం॥ హృదిస్థాదేవతాస్సర్వా హృదిప్రాణేప్రతిష్ఠితాః।
హృది త్వమసి యో నిత్యం తిస్రో మాత్రాః
పరస్తు స ః॥

హృదయములోనే సమస్తదేవతలున్నారు. హృదయములోనే సకల ప్రాణములు స్థిరములైయున్నవి. "ఈశ్వరస్సర్వ

భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి" యన్నట్లు ఓ ఈశ్వరా! నీవు హృదయములోనే యున్నావు. నీవు త్రిమాత్రస్వరూపమగు ప్రణవము లోనే యుంటున్నావు. పరుడవు.

81. మం॥ తస్యోత్తరతశ్శిరో, దక్షిణతః పాదౌ,
య ఉత్తరతస్స ఓంకారః, య ఓంకారస్స ప్రణవః,
యః ప్రణవః స సర్వవ్యాపీ, యస్సర్వవ్యాపీ సోఽనన్తః,
యోఽనన్తస్తత్తారం, యత్తారం తత్సూక్ష్మం,
యత్సూక్ష్మం తచ్ఛుక్లం యచ్ఛుక్లం తద్వైద్యుతం,
యద్వైద్యుతం తత్పరంబ్రహ్మ,యత్పరం బ్రహ్మ స ఏకః, య ఏకః సరుద్రః. యోరుద్రః స ఈశానః,
య ఈశానః స భగవాన్ మహేశ్వరః,

ఆ ఈశ్వరునియొక్క శిరస్సు ఉత్తరములోను, పాదములు దక్షిణములో నున్నవి. ఏది యుత్తరముగా నున్నదో, అదియే ఓంకారము, ఏది ఓంకారమో, అదియే ప్రణవము. ఏది ప్రణవమో అదియే సర్వవ్యాపి, ఏది సర్వవ్యాపియో అదియే అనంతము. ఏది అనంతమో అదియే తారము. ఏది తారమో అదియే సూక్ష్మము. ఏది సూక్ష్మమో అదియే శుక్లము. ఏది శుక్లమో అదియే వైద్యుతము. ఏది వైద్యుతమో అదియే పరబ్రహ్మము. ఏది పరబ్రహ్మమో అదియే ఏకము. ఎవడు ఏకమో అతడే రుద్రుడు, ఎవడు రుద్రుడో అతడే ఈశానుడు. ఎవడు ఈశానుడో అతడే భగవంతుడగు మహేశ్వరుడు.

ఇక మీదట ఓంకారమునకు ఓంకారమనియు, ప్రణవమనియు సర్వవ్యాపియనియు, ఇత్యాది నామధేయములు ఏకారణమువలనకలిగి నవో క్రమముగ నవి చెప్పబడుచున్నవి.

82. మం॥ అథ కస్మాదుచ్యతే ఓంకారః ।
ఎందువలన ఓంకారమని చెప్పబడియె?
"యస్మాదుచ్చార్యమాణ ఏవ ప్రాణా నూర్ధ్వముత్క్రామయతి తస్మాదుచ్యతే ఓంకారః॥"

ఏ కారణమువలన యుచ్చరింపబడగానే సమస్త ప్రాణములను యూర్ధ్వమును బొందించుచున్నదో, (తురీయపదవిని పొందించుచున్నదో) అందువలన ఓంకారమని,చెప్పంబడియె,

83. మం॥ అథ కస్మాదుచ్యతే ప్రణవః!
ఎందువలన ప్రణవమని చెప్పబడుచున్నది?
"యస్మాదుచ్చార్యమాణ ఏవఋగ్యజుస్సామాథర్వాఙ్గిరసో బ్రహ్మ బ్రాహ్మణేభ్యః ప్రణామయతి నామయతి చ తస్మాదుచ్యతే ప్రణవః"

ఏ ప్రణవము యుచ్చరింపబడగానే బ్రాహ్మణుల కొఱకు, ఋగ్ యజుస్సామాథర్వవేదములను లోనగునటుల చేయుచున్నదో అదియే ప్రణవము. అనగా ఒక ప్రణవోచ్చారణముచేత సమస్త వేదముల పఠనఫలమును బ్రాహ్మణుడు అనగా బ్రహ్మజ్ఞాని పొందుచున్నాడు. ప్రణూయతే ప్రస్తూయత ఇతి ప్రణవః" సమస్తాగమాది శాస్త్రములచేతను స్తోత్రముచేయబడుచున్నది గనుక దానికి ప్రణవమని పేరు వచ్చెను. మఱియు "ప్రణవతీతి ప్రణవః" యీ ప్రణవము భగవంతునిస్తోత్రము చేయుచున్నది కనుక ప్రణవమని పేరు వచ్చెను. "జగత్కారణత్వేన ప్రణూయతే ప్రస్తూయత ఇతి ప్రణవః" సమస్తలోకములకుకారణమని స్తోత్రము చేయబడుచున్నదికనుకను ప్రణవమయ్యెను.

84. మం॥ అథకస్మాదుచ్యతే సర్వవ్యాపీ? యస్మాదుచ్చార్య
మాణ ఏవ సర్వాన్ లోకాన్ వ్యాప్నోతి।
స్నేహో యథా పలలపిండమివ శాంతరూపమోత
ప్రోతమనుప్రాప్తో వ్యతిషక్తస్య తస్మాదుచ్యతే
సర్వవ్యాపీ॥

ఎందువలన సర్వవ్యాపి యని చెప్పబడుచున్నది? ఎందు వలన యుచ్చరింపబడగానే సమస్తలోకములను మాంస ఖండమును తైలమువలె (నూనె) వ్యాపించియున్నదో, వస్త్రమునకు పడుగుపేక వలె ఓత ప్రోత భావమును (బాహ్యాభ్యంతరముల వ్యాపించుటను) శాంతస్వరూపమును బొందినదై అంతట వ్యాపించియున్నదో, అంతట సంబంధించియున్నదో, అందువలన ప్రణవము సర్వవ్యాపి యని పేర్కొనబడెను.

85, మం॥ అథ కస్మాదుచ్యతేఽనన్తః?
ఎందువలన అనంతమని చెప్పబడుచున్నది?
యస్మాదుచ్చార్యమాణ ఏవ తిర్యగూర్ధ్వమధస్తాచ్చా
స్యాన్తోపలభ్యతే తస్మాదుచ్యతేఽనన్తః॥

ఎందువలన యుచ్చరింపబడగానే అడ్డముగా, యూర్ధ్వముగా, క్రిందుగా వ్యాపించినదై దేనియొక్క లయము అంతము తెలియబడదో, అందువలన అనంతమని చెప్పబడుచున్నది.

86. మం॥ అథ కస్మాదుచ్య తే తారమ్?
ఎందువలన తారమని చెప్పబడుచున్నది?
యస్మాదుచ్చార్యమాణ ఏ వ గ ర్భ, జ న్మ, వ్యాధి,
జరా, మరణ, సంసారమహాభయాత్తారయతి త్రాయతే
చ తస్మాదుచ్యతే తారమ్॥

ఎందువలన యుచ్చరింపబడుచున్నదయ్యే, గర్భములో పుట్టుట, వ్యాధి జరామరణాత్మకమైన సంసార మనే మహాభయము నుండి తరింప జేయుచున్నదో (రక్షించుచున్నదో) అందువలన తారమని చెప్పబడుచున్నది. "తారయతీతి తారకః" తరింపజేయునది కనుక యీ ప్రణవమునకు తారకమనియు పేరు గలిగెను.

87. మం॥ అథ కస్మాదుచ్యతే శుక్లమ్?
ఎందువలన శుక్లమని చెప్పబడుచున్నది?
యస్మాదుచ్చార్యమాణ ఏవ క్లన్దతే
క్లామయతి చ తస్మాదుచ్యతే శుక్లమ్॥

ఏది ఉచ్చరింపబడగానే హృదయములోని దుర్మలిన సంస్కారములన్నియు నాశమొందింపబడునో, అనగా హృదయము శుద్ధమగునో, మఱియు జలమేలాగున స్వచ్ఛమై యుండునో ఆలాగు నసే దేనిని ధ్యానించువారియొక్క మనస్సు గూడ నిర్మలమగునో అది (ప్రణవము) శుక్లమని చెప్పబడుచున్నది.

88. మం॥ అథ కస్మాదుచ్యతే సూక్ష్మమ్?
ఎందువలన సూక్ష్మమని చెప్పబడుచున్నది?
యస్మాదుచ్చార్యమాణ ఏవ సూక్ష్మో భూత్వా
శరీరాణ్యధితిష్ఠతి సర్వాణి చాంగాన్యభిమృశతి,
తస్మాదుచ్యతే సూక్ష్మమ్॥

ఎందువలన యుచ్చరింపబడగానే సూక్ష్మస్వరూపమును దాల్చి, శరీరములను యధిష్ఠించుచున్నదో, సమస్తావయవములను స్పృశించుచున్నదో, అందువలన ప్రణవము సూక్ష్మమని చెప్పబడుచున్నది.

89. అథ కస్మాదుచ్యతే వైద్యుతమ్?

ఎందువలన వైద్యుతమని పేర్కొనబడుచున్నది ?

యస్మాదుచ్చార్యమాణ ఏవా వ్యక్తే మహతి ।
తమసి ద్యోతయతే తస్మాదుచ్యతే వైద్యుతమ్ ॥

ఎందువలన నుచ్ఛరింపబడగానే గొప్ప చీకటియందు మెరుపు తీగవలె అజ్ఞానాంధకారమందు ప్రకాశమును కలుగ జేయుచున్నదో (అజ్ఞానమును పూర్తిగా పోగొట్టుచున్నదో) అందువలన వైద్యుతమని చెప్పబడుచున్నది.

90. మం॥ అథ కస్మాదుచ్యతే పరంబ్రహ్మ ?

ఎందువలన పరంబ్రహ్మమని చెప్పబడుచున్నది ?

యస్మాత్పరమపరం పరాయణం చ బృహత్
బృహత్యా బృంహయతి తస్మాదుచ్యతే పరంబ్రహ్మ॥

ఎందువలన పరబ్రహ్మము అపరబ్రహ్మము (సగుణ నిర్గుణ బ్రహ్మలను) ప్రాప్యస్థానమునున్న బృహత్ బృహత్యా = గొప్ప వాక్కుచేత గర్జించుచున్నదో అనగా నుచ్ఛరింపబడగానే పొందించుచున్నదో, అందువలన పరం బ్రహ్మమని చెప్పబడుచున్నది.

91. మం॥ అథ కస్మాదుచ్యతే ఏకః?

ఎందువలన ఏకమని చెప్పబడియె ?

యస్సర్వాన్ ప్రాణాన్ సంభక్ష్య సంభక్షణేనాజః
సంసృజతి విసృజతి చ, తీర్థమేకే వ్రజన్తి
తీర్థమేకే దక్షిణాః ప్రత్యం చ ఉదంచః
ప్రాంచో అభివ్రజన్త్యేకే, తేషాం సర్వేషా
మిహసజ్గతిం, సాకం స ఏకోభూతశ్చరతి
ప్రజానం స్తస్మాదుచ్యత ఏకః ॥

ఏ ప్రణవము సమస్తప్రాణములను భక్షణము చేసి, భక్షించుటచే అనగా లయపఱచుటచేత (ఉపసంహారముచేతను అజమై (పుట్టుక లేనిదై) సమస్త లోకములను సృష్టించుచున్నదో, లయము చేయుచున్నదో, ఏ ఓంకారోపాసకులు సకల దిక్కులందున్న తీర్థములను బొందుచున్నారో, అనగా ప్రణవోపాసనచేతనే సమస్త తీర్థముల ప్రయోజనమును పొందుచున్నారో, వారికిచ్చుటనే యుత్తమమగు గతి గలుగుచున్నది. మఱియు నేప్రణవోపాసకుడు సకలజీవరాసులలో నొక్కడై య్యే సంచరించుచున్నాడో, అందువలన ప్రణవము యేకమని చెప్పబడుచున్నది.

92. మం॥ అథ కస్మాదుచ్యతే రుద్రః ?

ఎందువలన రుద్రుడని చెప్పబడుచున్నది?

యస్మాదృషిభిః నాన్యైర్భక్తైర్ద్రుత-
మస్యరూపముపలభ్యతే తస్మాదుచ్యతే రుద్రః॥

ఎందువలన మహర్షులచేత మాత్రమే (యితరభక్తులచేత కాదు,) దేనియొక్క స్వరూపము శీఘ్రముగా పొందబడుచున్నదో అందువలన రుద్రుడని చెప్పబడుచున్నది.

93. మం॥ అథ కస్మాదుచ్యతే ఏకో రుద్రః?

ఎందువలన రుద్రుడొకడే యని చెప్పబడుచున్నది?

ఏక ఏవరుద్రః న ద్వితీయాయ తస్మై
య ఇమాం లోకానీశత, ఈశనీయుర్జననీయుః,
ప్రత్యఙ్జనాఃతిష్ఠతి సంచుకో చాంతకాలే
సంసృజ్య విశ్వాభువనాని గోప్తా
తస్మాదుచ్యత ఏకో రుద్రః।

రుద్రుడొక్కడే. రెండవవాడు లేడు. ఎవడీ లోకముల నన్నిటిని సృష్టించి అంతరాత్మయై యున్నాడో, ప్రళయకాలములో లోకములను తమలో నిమిడ్చుకొని, మరల సృజించి రక్షించుచున్నాడో, అందువలన రుద్రుడొక్కడనియే చెప్పబడుచున్నాడు. ఇచ్చట ఓంకారమును రుద్రుడని యెఱుంగవలయును.

94. మం॥ అథ కస్మాదుచ్యతే ఈశానః?

ఎందువలన ఈశానుడని చెప్పబడుచున్నది?

యస్సర్వాన్ దేవానీశతే ఈశనీభిః
జననీభిశ్చ శక్తిభిః, అభిత్వాశూర
నో నుమో దుగ్ధా ఇవధేనవః, ఈశానమస్య జగతః
స్వర్దృశమీశానమింద్ర తస్థుష
ఇతి తస్మాదుచ్యతే ఈశానః ॥

సమస్త దేవతలను యేదైతే ప్రజనన శక్తిగల పరాశక్తుల చేత సృష్టించుచున్నదో, సమస్త లోకములకు ప్రభువుగా నున్నదో అందువలన ఈశానుడని చెప్పబడియె.

95. మం॥ అథ కస్మాదుచ్యతే భగవాన్?

ఎందువలన భగవంతుడని చెప్పబడుచున్నది?

యస్సర్వాన్ భావాన్ నిరీక్ష్యత్యాత్మ-
జ్ఞానం నిరీక్షయతి యోగం గమయతి
స ఏవ తస్మాదుచ్యతే భగవాన్ ॥

ఎవడు సమస్తభావనలను సాక్షియై చూచుచున్నాడో, ఆత్మజ్ఞానమును కలుగజేయుచున్నాడో, యోగమును పొందించుచున్నాడో వాడే భగవంతుడు. ప్రణవము అట్టి భగవత్స్వరూపమని భావము.

96. మం॥ అథ కస్మాదుచ్యతే మహేశ్వరః?

మహేశ్వరుడని యెందుకు చెప్పబడుచున్నది?

యస్సర్వాన్ లోకాన్ సంభక్ష
స్సంభక్షయత్యజస్రం సృజతి విసృజతి
వాసయతి తస్మాదుచ్యతే మహేశ్వరః ॥

ఎవడు సమస్తలోకములను సంహరించి యెల్లపుడు లయపరచుచున్నాడో, సృష్టించుచున్నాడో, రక్షించుచున్నాడో, అందువలన మహేశ్వరుడని చెప్పబడుచున్నాడు.

97. మం॥ కస్మాదుచ్యతే మహాదేవః?

ఎందువలన మహాదేవుడని చెప్పబడుచున్నాడు?

యస్సర్వాన్ భావాన్ పరిత్యజ్యాత్మజ్ఞాన యోగైశ్వర్యే
మహతి మహీయతే తస్మాదుచ్యతే మహాదేవః ।

సమస్త భావములను వదలి యాత్మజ్ఞానము, యోగము, ఐశ్వర్యము వీట్లతో కూడుకొన్నవాడై, మహీయతే=పూజింపబడుచున్నాడో, అందువలన మహాదేవుడని చెప్పబడుచున్నాడు, మహాదేవుడు ప్రణవమయ్యే యున్నాడు.

మాత్రలయొక్క స్వరూపమును ఫలితమును జెప్పుచున్నాడు.

98. మం॥ యాసా ప్రథమా మాత్రా బ్రహ్మ దేవత్యా
రక్తా వర్ణేన యస్తాం ధ్యాయతే నిత్యం
స గచ్ఛే ద్బ్రాహ్మం పదమ్ ॥

చతుర్ముఖ బ్రహ్మదేవతా స్వరూపమును, రక్తవర్ణమును దాల్చిన ప్రణవముయొక్క ప్రథమ మాత్రను యెవడు ఉపాసించు

చున్నాడో యా సాధకుడు బ్రహ్మపదమును (బ్రహ్మలోకమును) బొందుచున్నాడు.

99. మం॥ యాసా ద్వితీయా మాత్రా విష్ణు దేవత్యా
కృష్ణా వర్ణేన యస్తాం ధ్యాయతే నిత్యమ్
స గచ్ఛేద్వైష్ణవం పదమ్ ॥

ఉపాసకుడు విష్ణుదేవతా స్వరూపముగల కృష్ణవర్ణమగు ద్వితీయ మాత్రను, నిర్విషయుడై చింతించునో వాడు వైష్ణవపదమును అనగా విష్ణులోకమును బొందును.

100. మం॥ యాసా తృతీయా మాత్రా ఈశానదేవత్యా
కపిలా వర్ణేన యస్తాం ధ్యాయతే నిత్యం
స గచ్ఛేదైశానం పదమ్ ॥

ఈశానదేవతయు, కపిలవర్ణముగల తృతీయ మాత్రను ఉపాసించువాడు ఐశానపదమును (ఈశ్వరలోకములు) బొందుచున్నాడు.

101. మం॥ యాసాఽర్థచతుర్థీ మాత్రా సర్వ దేవత్యా
ఽవ్యక్తభూతా ఖం విచరతి శుద్ధస్ఫటిక
సన్నిభా వర్ణేన, యస్తాం ధ్యాయతే నిత్యం
స గచ్ఛేత్పదమనామయమ్ ॥

వర్ణములో స్ఫటిక సమానమైనదియు, శుద్ధమైనదియు, సమస్తదేవతా స్వరూపమైనదియు, అవ్యక్తమైనదియు, ఆకాశములో సంచరించునదియునగు అర్థమగు చతుర్థమాత్రను ఉపాసించువాడు, శాశ్వతమగు స్థానమును (పరబ్రహ్మమును) బొందుచున్నాడు.

102. మం॥ తదేత దుపాసీత మునయో వాగ్వదన్తి
న తస్య గ్రహణ మయం పంథా విహిత
ఉత్తరేణ, యేన దేవా యాన్తి
యేన పితరో యేన ఋషయః
పరమపరం పరాయణం చేతి॥

మహర్షులు యీ ప్రణవమునే యుపాసించవలయునని చెప్పుచున్నారు. ఆ ప్రణవముయొక్క యవగాహనము దుస్సాధ్యము, ఈ ప్రణవమార్గమే యుత్తరాయణమని చెప్పబడెను. ఏ మార్గముచేత దేవతలు, పితృ దేవతలు, ఋషులు, పరమును, అపరమును, పరాయణం = ప్రాప్యస్థానమును బొందుచున్నారో అదియే ఉత్తరాయణము, ఇటుల అథర్వశిరోపనిషత్తు చాటుచున్నది.

—: అథ నారదపరివ్రాజకోపనిషత్ :—

103. మం॥ అథ హైనం భగవన్తం పరమేష్ఠినం నారదః
పప్రచ్ఛ సంసారతారకం ప్రసన్నో బ్రూహీతి,
తథేతిపరమేష్ఠీవక్తుముపచక్రమే, ఓమితిబ్రహ్మేతి
వ్యష్టిసమష్టిప్రకారేణ, కా వ్యష్టిః, కా సమష్టిః,
సంహారప్రణవః సృష్టిప్రణవశ్చాన్తర్బహిశ్చోభ
యాత్మకత్వాత్త్రివిధో బ్రహ్మప్రణవః ॥

సర్వలోకపూజ్యుడగు బ్రహ్మదేవుని నారద మహర్షి ఓ భగవంతుడా! అనుగ్రహమూర్తివై సంసారమును తరింపజేయునది యెద్దియో అద్దానిని నాకు అనుగ్రహించుమని అడిగెను. బ్రహ్మదేవుడట్లేయని చెప్పుటకు ప్రారంభించెను. "ఓం" అని 'బ్రహ్మ' అని (ఓంకారమనగా బ్రహ్మమేను) అది (ప్రణవము) వ్యష్టిరూపముగను

సమష్టిరూపముగను నున్నది. వ్యష్టి యనగా ప్రణవముయొక్క అవయవముల (అ. ఉ. మ.) విభజించుట, సమష్టి యనగా అఖండ మగు ప్రణవమునే సముదాయరీతిగా చెప్పుట. సమష్టి పూర్వకముగా ప్రణవ విభాగమును చెప్పుచున్నారు. బ్రహ్మమును ప్రతిపాదించునట్టి బ్రహ్మప్రణవము మూడు తెఱంగులై విలసిల్లుచున్నది. (1) సంహార ప్రణవము, (2) సృష్టి ప్రణవము, అంతః (లోపల) బహిః (బయట) ఉభయాత్మకత్వాత్ (రెండు రూపములగుటవలన,) (3) బాహ్యాభ్యన్తరరూపమగు ఉభయాత్మక ప్రణవము అని, మఱియు బాహ్యాభ్యన్తర ప్రణవమే వివరింపబడుచున్నది.

104. మం॥ అన్తః ప్రణవో వ్యావహారిక ప్రణవః, బాహ్య
ప్రణవ, ఆర్షప్రణవః, ఉభయాత్మకో విరాట్ ప్రణవః,
సంహారప్రణవో బ్రహ్మప్రణవ అర్ధమాత్రా ప్రణవః,
ఓమితిబ్రహ్మ, ఓమిత్యేకాక్షరమన్తః ప్రణవం విద్ధి,
స బాష్టధా భిద్యతే ॥

అన్తః ప్రణవమనగా బ్రహ్మమును బోధించుటకై వ్యవహారార్థము కల్పింపబడినది. బాహ్యప్రణవమనగా, యజ్ఞయాగాదుల యందు కల్పింపబడిన ప్రణవము. ఉభయాత్మక ప్రణవమనగా విరాట్‌ను బోధించునది. బ్రహ్మప్రణవ భేదమగు సంహారప్రణవము అర్ధమాత్రగలది. కేవల పరబ్రహ్మమునే బోధించుచున్నది. ఓమితి బ్రహ్మ. "ఓమ్" అనునది పరబ్రహ్మము. ఇటుల జెప్పినందుచే బ్రహ్మ (పరబ్రహ్మము) "ఓమితి" ఓంకారవాచ్యమనియే యెఱుంగవలయును. మఱియు సంసారమును తరించువారలకు 'ఓమ్' అనునది సాక్షాత్ పరబ్రహ్మప్రాప్తికి సాధనముగా నున్నదని తెలియవలెను. అట్టి ప్రణవమేదన! ఓమితి, "ఓమ్" అను ఒకే యక్షరము, అద్దానిని అన్తఃప్రణవం, విద్ధి—అన్తరాత్మప్రతిపాదక ప్రణవముగా తెలిసికొనుమా!

"సబాష్టధా భిద్యతే అకారోకార మకారార్ధమాత్రా నాదబిందు కళా శక్తి శ్చేతి" అది యెనిమిది విధములుగా భేదమును జెందుచున్నది. అదెటులన అకార, ఉకార, మకార, అర్ధమాత్ర, నాద, బిందు, కళా, శక్తి అని.

105. మం॥ తత్రచత్వార అకారశ్చాయుతావయవాన్విత
ఉకారః, సహస్రావయవాన్వితో మకారః॥,
శతావయవోపేతోఽర్ధమాత్రాప్రణవోఽనన్తావ
యవాకారః, సగుణో విరాట్ ప్రణవః సంహారో
నిర్గుణ ప్రణవ, ఉభయాత్మకోత్పత్తి ప్రణవో
యథా ప్లుతో విరాట్ ప్లుతః ప్లుత సంహారో
విరాట్ ప్రణవః షోడశమాత్రాత్మకః, షట్త్రిం
శత్తత్త్వాతీతః,షోడశమాత్రాత్మకత్వం కథమిత్యుచ్యతే

ఆ భేదములలో నాలుగగు అకార ఉకార మకార అర్ధమాత్రలలో అకారము అయుతావయవాన్వితః – పదివేల అవయవములతో కూడుకొన్నది. ఉకారము వేయి అవయవములతో కూడుకొన్నది. మకారము నూరవయవములతో కూడుకొన్నది. అర్ధమాత్రా ప్రణవము "అనన్తావయవాకారః" అన్తములేని అవయవముల ఆకారము గలది. విరాట్ ప్రణవము (విరాట్‌ను బోధించునది) సగుణమని, నంహారభూతమగు బ్రహ్మ ప్రణవము నిర్గుణబ్రహ్మ ప్రతిపాదకమని, ఉభయాత్మక ప్రణవము ఉత్పత్తి ప్రణవమని నెఱుంగవలయును. మఱియు ప్రణవము ప్లుతభేదముచే మఱి యొక విధముగా చెప్పబడుచున్నది. విరాట్‌ప్లుతము, ప్లుత సంహారము అని, విరాట్ ప్రణవము షోడశమాత్రల స్వరూపము గలది. ముప్పది యారు తత్త్వములను అతిక్రమించినది పరమపురుషుడని చెప్ప

బడియె. విరాట్ ప్రణవమునకు పదహారు మాత్రలు, ఎటులన, చెప్పబడుచున్నవి.

106. మం॥ అకారః ప్రథమో, ఉకారో ద్వితీయా, మకార
స్తృతీయాఽర్ధమాత్రా చతుర్థీ, నాదఃపంచమీ, బిందుః
షష్ఠీ, కలాసప్తమీ, కలాతీతాఽష్టమీ, శాన్తిర్నవమీ
శాన్త్యతీతా దశమీ, ఉన్మన్యేకాదశీ, మనోన్మనీ
ద్వాదశీ, పురీ త్రయోదశీ, మధ్యమా చతుర్దశీ
పశ్యన్తీ పంచదశీ, పరా షోడశీ, పునశ్చతు
షష్టిమాత్రా, ప్రకృతి పురుష ద్వైవిధ్యమాసాద్య
అష్టావింశత్యుత్తరశతభేదమాత్రా స్వరూపం
ఆసాద్య సగుణ నిర్గుణత్వ ముపేత్యైకోఽపి
బ్రహ్మ ప్రణవః సర్వాధారః పరం జ్యోతి రేష
సర్వేశ్వరో విభుః సర్వదేవమయః సర్వప్రపంచాధార-
గర్భితః ॥

ప్రథమ మాత్ర అకారము. ద్వితీయ మాత్ర ఉకారము. తృతీయ మాత్ర మకారము, చతుర్ధమాత్ర అర్ధమాత్ర, పంచమీ మాత్ర నాదము, షష్ఠీమాత్ర బిందువు, సప్తమీమాత్ర కళ, అష్టమీ మాత్ర కళాతీతము, నవమీ మాత్ర శాన్తి, దశమీమాత్ర శాన్త్యతీతము, ఏకాదశీ మాత్ర ఉన్మనీ, ద్వాదశీ మాత్ర మనోన్మనీ, త్రయోదశీ మాత్ర పురి, చతుర్దశీమాత్ర మధ్యమ, పంచదశీమాత్ర పశ్యన్తీ, షోడశీ మాత్రపరా, ఈ విధముగ మఱల యీ ప్రణవము అరవై నాలుగు మాత్రల స్వరూపము కలదై, ఒక్కొక్క మాత్రకు ప్రకృతి పురుషులయొక్క భేదముచే ద్వివిధత్వమును బొంది, మొత్తము నూట యిరువదెనిమిది భేదములతో గూడిన మాత్రా స్వరూపములను బొంది, సగుణ నిరుణ స్వరూపమును బొందు

చున్నది. అద్వితీయమగు బ్రహ్మమును ప్రతిపాదించు యీ బ్రహ్మ ప్రణవము ఒకటే అయిన సమస్త జగత్తునకు యాధారముగాను, పరంజ్యోతి స్వరూపముగాను, సకల ప్రపంచములకు నియామకము గాను, వ్యాపకముగాను, సర్వదేవతా స్వరూపముగాను అయి సమస్త ప్రపంచమును తనలో నుపసంహరించుకొని యున్నది. అనగా సర్వ ప్రపంచము యీ ప్రణవమునుండియే యుత్పత్తి యగుచున్నది.

107. మం॥ సర్వాక్షరమయః కాలః సర్వాగమమయశ్శివః,
సర్వశ్రుత్యుత్తమో మృగ్యః సకలోపనిషన్మయః,
భూతం భవ్యం భవిష్యద్యత్త్రికాలోదితమవ్యయమ్॥
తదప్యోంకారమేవాయం విద్ధి మోక్షప్రదాయకమ్
తమేవాత్మానమి త్యేతద్బ్రహ్మశబ్దేన వర్ణితమ్
తదేక మమృత మజర మనుభూయ తథోమితి॥

ఏది సర్వాక్షరరూపమగు కాలమైయున్నదో, సర్వశాస్త్ర రూపమైయున్నదో, మంగళకరమై, సర్వవేదములకు మూలభూతమై, విచారించతగినదై, సకలోపనిషత్స్వరూపమైయున్నదో, భూత భవిష్యద్వర్తమాన కాలములలో నున్నదై, అవ్యయమైయున్నదో, అదియే ఓంకారమని యెఱుంగుము. అదియే మోక్షప్రదాయకము, ఆ ప్రణవము యొక్క స్వరూపమే బ్రహ్మశబ్దముచేత వర్ణింపబడినది. ప్రణవ వాచ్యమగు పరబ్రహ్మమును బొంది, అమృతుడును, జరామరణవర్జితుడనునై "బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితః" యన్నట్లు యనుభవజ్ఞానము కలవాడై, బ్రహ్మములో సంచరించుచు," బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" బ్రహ్మవేత్త బ్రహ్మమే యగుచున్నాడు. ఈ విధముగా నారదపరివ్రాజకోపనిషత్తు విజ్ఞాపనము చేయుచున్నది.

108. శ్లో॥ ఆద్యం చ అత్రిత్ర్యక్షరం బ్రహ్మత్రయీ యస్మిన్
ప్రతిష్ఠితా ।
ఏకాక్షరం పరంబ్రహ్మ ప్రాణాయామః పరంతపః ॥
శ్లో॥ ప్రణవాద్యాస్త్రయో వేదాః ప్రణవే పర్యవస్థితాః।
వాఙ్మయం ప్రణవం సర్వం తస్మాత్ప్రణవమభ్యసేత్॥

అకార, ఉకార, మకారములతో కూడికొనిన మొదట నున్న బ్రహ్మము యీ ప్రణవమే. ఆ ప్రణవమందే సమస్త వేదములు ప్రతిష్ఠితములై యున్నవి. పరబ్రహ్మ స్వరూపమైనది యేకాక్షరమే. అక్షరమగు ఓంకారమేను. ఆ ప్రణవమును ఆలంబనముగా చేసికొని, ప్రాణాయామమును (ధ్యానమును) చేయడమే పరమతపస్సు. మూడు వేదములున్ను ఓంకారమే మొదటిగా గలవి. ప్రణవముచేతనే ఆ వేదములు సమాప్తిని చెందినవి. సకల వాక్కులున్ను ప్రణవ స్వరూపములే. ఈ ప్రణవము నొకదానిని జపించినచో సకల మంత్రజపములును, సమస్త వేదాధ్యయనమున్ను చేసినవారే యగుదురు. కనుక "పద్మాసనం సమారుహ్య సమకాయ శిరోధరః, నాసాగ్రదృష్టి రేకాన్తే జపేదోంకారమవ్యయమ్" సాధకుడు యేకాన్త ప్రదేశమున పద్మాసనస్థుడై, సమానముగా శరీరమును, శిరస్సును యుంచినవాడై, భ్రూమధ్యమున దృష్టి నుంచి, నాశరహితమైనటువంటి ప్రణవమును, బ్రహ్మభావముతో జపించవలయునని యోగచూడామణ్యుపనిషత్తు ప్రతిపాదించిన రీతిగా ప్రణవోపాసన జేయవలయును.

అ థ రా జ యో గ వి చా ర ః

109. తస్య మధ్యే మహావహ్నిః తత్పార్శ్వే చంద్ర
సూర్యయోః।
తజ్ఞాతుర్జాయతే నాదః ఓమిత్యేవంతుచాద్వయమ్॥

తేన మార్గేణ గత్వాతు చిదాకాశం నిరంజనమ్ ।
నిర్గుణం బ్రహ్మరంధ్రే చ సగుణం హృది సంస్మరేత్॥
విరాట్‌రూపం భ్రువోర్మధ్యే ధ్యాయేద్యోగప్రసిద్ధయే।
మూలాధారే గ్రంథిం భిత్వా పాదనాదం ప్రకాశతే॥

విష్ణుగ్రంథిం తతోభిత్వా అర్ధనాదం ప్రకాశతే ।
రుద్రగ్రంథిం తతోభిత్వాత్రిపాదం శ్రూయతేసదా॥

బ్రహ్మరంధ్రే పూర్ణనాదం చిదాకాశే నిరన్తరం ।
పూర్ణనాదే మనోరైక్యం రాజయోగాభిధాయకమ్ ॥
గురువాక్యేన లభ్యన్తే నాన్యథా గ్రంథ కోటిభిః ।

సుషుమ్నానాడియొక్క మధ్య అగ్ని మండలము, ఆనాడి పార్శ్వభాగమున చంద్రమండల సూర్యమండలములు గలవు. ఇవి గుర్తెఱింగినచో యత్యద్భుతమగు ప్రణవనాదము స్పష్టముగా గోచరించును. ఆ సుషుమ్నామార్గములో పోయి, బ్రహ్మరంధ్రమున చిదాకాశమనునట్టియు, నిరంజనమైన, నిర్గుణమైన బ్రహ్మమును హృదయములో సగుణస్వరూపుని భ్రూమధ్యమున సర్వవ్యాపకుడగు విరాడ్రూపుని, యోగులు యోగసిద్ధి కొఱకు భావన చేయవలయును. ఈ ప్రకారము చేయగా మూలాధారమున ఆ గ్రంథిని భేదించి ప్రణవనాదము పాతిక భాగము వినపడును. తరువాత విష్ణుగ్రంథిని భేదించి యర్ధనాదము, రుద్రగ్రంథిని భేదించి అనగా హృదయములో ముప్పాతిక భాగము యిటులెల్లపుడు ప్రణవనాదము వినపడును. చిదాకాశ స్వరూపమగు బ్రహ్మరంధ్రములో పరిపూర్ణనాదము యెప్పుడు వినపడుచుండును. సర్వతో వ్యాపకమగు పూర్ణనాదమందు మనస్సును లయింపజేయడమే రాజయోగమని చెప్పబడుచున్నది. గురువాక్యముచే నిది లభించును గాని అనేక గ్రంథములచే దొరుకునదిగాదు, ఇది గురుకీలకము.

కేవలం కుంభకం యు_క్తం ఏకనాదం సదాశివే।
దశనాదస్య మధ్యే తు ఘంటానాదం సదా శృణు॥

కేవలకుంభకాభ్యాసముచే ప్రణవనాదమును, హృదయ స్థానములో గు_ర్తెఱింగి దశనాదముల మధ్య ఘంటానాదమునే యెల్లప్పుడు వినుము. ఆనాదమే ప్రణవధ్వని యని భావన జేయుము.

ఈ విధముగా రాజయోగ విచారమున చెప్పబడియె.

-: అ ను భూ తి ప్ర కా శ ము :-

110. తత స్తే నిర్గుణం బ్రహ్మ పప్రచ్ఛుశ్శుద్ధబుద్ధయః।
అణోరణీయాన్యః ప్రత్యఙ్ ప్రణవే తం తదాప్రభో॥

సగుణబ్రహ్మను ధ్యానించి పరిశుద్ధాత్ములగు దేవతలు శుద్ధబుద్ధులై నిర్గుణ బ్రహ్మమును దెలుపమని ప్రశ్నించిరట. అణువు కంటె యణువైన యే ప్రత్యగాత్మ (అంతరాత్మ) ప్రణవమందు గలదో, దానిని నో ప్రభువా! చెప్పుమని ప్రజాపతిని యడిగిరట.

పరమాణోర్యోగినేత్రగమ్యం రూపం యదస్తి తత్ ।
ప్రతీచో నా_స్త్యతః ప్రత్యఙ్ణీయాన్పరమాణుతః॥

యోగి నేత్రములకు గోచరించిన పరమాణువుయొక్క రూపమేదియో, యా రూపముగూడ ప్రత్యగాత్మకులేదు. కనుక ప్రత్యగాత్మ పరమాణువుకంటెను సూక్ష్మమైనది.

ఓంకారో వాచక_స్తస్య ప్రతీకం వేతి హి శ్రుతం ।
ఓంకారేణాత్మనోధ్యానం వదా స్మభ్యం సవి_స్తరం ॥

ఆ ప్రత్యగాత్మకు ఓంకారము వాచకము. లేక ప్రతీకము. (అవయవము) అని ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడియున్నది. కనుక ప్రణవముచే నాత్మను ధ్యానించుటను, వి_స్తరించి మాకు జెప్పుము.

శ్రూయతామయ మోంకారో నిశ్శేషజగదాత్మకః।
ఇతి ధ్యాత్వా బ్రహ్మ సర్వమాత్మాబ్రహ్మేతి వైస్మరేత్ ॥

ఓ దేవతలారా! వినుడు. ఓంకారము సమ_స్త జగత్స్వరూపమని "సర్వం ఖల్విదం బ్రహ్మ" సమ_స్తము బ్రహ్మస్వరూపమని ధ్యానించిన సర్వము బ్రహ్మమగును. ఆత్మ (తాను) బ్రహ్మమనియే స్మరింపవలెను.

యదోంకారస్య సార్వాత్మ్యం ధ్యానాయైతన్న వస్తుతః ।
యద్బ్రహ్మణస్తు సార్వాత్మ్యం వస్తుతోఽప్యేత
దీక్ష్యతామ్ ॥

బ్రహ్మస్యాత్సచ్చిదానందరూపం సర్వేషు వస్తుషు ।
విద్య న్తే సచ్చిదానందాః ఇతి హ్యార్థ్వం ప్రవక్ష్యతే ॥
దేహేంద్రియాదిసాక్షీయ ఆత్మాఽస్మిన్బ్రహ్మరూపతాం ।
సచ్చిదానందరూపత్వాదసంసారిణి యుజ్యతే॥
దేహాద్యుపాధిసంబంధా త్సంసారిత్వం చిదాత్మనః ।
స్వతస్సోఽయమసంసారీ బ్రహ్మత్వం యుజ్యతే తతః ॥

ఓంకారమునకు జెప్పిన సర్వాత్మభావము ధ్యానముకొఱకే. వా_స్తవముకాదు. బ్రహ్మమునకుగల సర్వాత్మభావమువా_స్తవము. దానినే వా_స్తవముగా నీయోంకార భావమున చూడవలయు. బ్రహ్మముసచ్చిదానందరూపము, సత్తు, చిత్తు, ఆనందము నన్నివస్తువులందును గలవని యికమీద జెప్పెదము. సత్తు-ఉన్నది. చిత్తు-చైతన్యము, జ్ఞానము-ఆనందము-సుఖము, ప్రేమ, దేహేంద్రియములకు సాక్షియై యే ఆత్మ కలదో, అది సచ్చిదానందరూపము కనుక సంసారి కాని యాయాత్మ యందు బ్రహ్మరూపము చెప్పదగియున్నది. దేహాద్యుపాధి సంబంధమువలన చిదాత్మకు సంసారబంధము కలిగినది. స్వయముగా నది యసంసారి కనుక బ్రహ్మత్వము దానికి దగును.

ఓమిత్యుచ్చారయన్ ధ్యాతాస్వాత్మానం బ్రహ్మణాసహ ।
ఏకీకృత్య పునర్బ్రహ్మ ణ్యేకీకుర్యాత్తథాఽఽత్మనః॥

ఓం అని యుచ్చరించుచు ధ్యానము చేయువాడు తన్ను బ్రహ్మముతో నేకీభవింపజేసి బ్రహ్మమునుగూడ నట్లాత్మ(తన)తో నేకీభవింపజేయవలయును.

111. శ్లో॥ చత్వారోహ్యష్టమే ఖండే యోగాస్తుర్యస్య భాసకాః ।
ఓంకారనామా ప్రణవే నాదో యస్తత్ర వర్ణితాః ॥
ఓతానుజ్ఞాత్రనుజ్ఞాతైరవికల్ప ఇతీరితాః ।
భేదైర్యోగావిభిన్నాః స్యురభయం బ్రహ్మతైర్భవేత్
ఓంకారమంత్రయోర్ధ్యేయం వస్తుయద్బహుధేరితం ।
తత్తత్త్వం నవమే ఖండే విస్పష్టం ప్రవివిచ్యతే।

అష్టమ ఖండమందు నాలుగు యోగములు తుర్యమును భాసింపఁజేయునవి కలవు. (సమాధినని యర్థము.) ప్రణవమునందే నాదము కలదో, యా యోంకారనామ యోగములచ్చట వర్ణింపబడినవి. ఓత, యనుజ్ఞాత, యనుజ్ఞ, యవికల్పము యను భేదములతో వేర్వేఱుగా యోగములు చెప్పఁబడినవి. వాటిచేత భయరహితమైన బ్రహ్మమగును. ఓంకారమందు, మంత్రరాజమునందును ధ్యానింపదగినదిగా ననేకవిధముల వస్తువు చెప్పబడెను. దాని తత్త్వము తొమ్మిదవ ఖండమందు స్పష్టముగా వివరింపబడుచున్నది.

య ఆత్మాధ్యాతృదేహేషు యశ్చధ్యేయేషు భాసతే ।
ఏక ఏవ స చిద్రూపో మాయయా భాత్యనేకవత్ ॥
సుషుప్తౌ జీవచైతన్య మద్వయం బ్రహ్మతాం వ్రజేత్ ।
జగత్సర్వమవిద్యేతి సర్వైరప్యనుభూయతే ॥

సృష్టేః ప్రాగప్యేవమాసీత్సా మాయా వటబీజవత్ ।
అనేకరూపతాం ప్రాప్య జీవేశావపి నిర్మమే ॥
కార్యోపాధిరయం జీవః కారణోపాధిరీశ్వరః ।
ఉపాధ్యోర్ద్వయో చిదాభాసౌ తేజీవేశా వుదీరితౌ ॥

ధ్యాతలయొక్క దేహములందు నేయాత్మ భాసించుచున్నదో, ఏ యాత్మ ధ్యానము చేయదగిన వస్తువులందు భాసించుచున్నదో, యది యొక్కటే చిద్రూపమై మాయచేత ననేక విధములుగా భాసించుచున్నది, సుషుప్తి యందద్వితీయ చైతన్యము బ్రహ్మత్వమును బొందును. జగత్తంతయు నవిద్యయని యందఱు ననుభవించుచున్నారు. సృష్టికి ముందుగూడ నిట్లేయుండెను. మఱ్ఱివిత్తువలె (సృష్టికి ముందు)యీ మాయ యుండి పిమ్మట యనేకరూపములనొంది జీవేశ్వరులను నిర్మించెను. ఈ జీవుడు కార్యము లుపాధిగా గలవాడు. కారణములుపాధిగా గలవాఁడీశ్వరుడు. ఉపాధుల రెంటియం దేచిదాభాసలు కలవో యవి జీవేశ్వరులనఁబడుచున్నవి.

112 శ్లో॥ నియంతేశోఽనుమన్తాతు జీవస్సోఽపి ద్విధా భవేత్ ।
సమష్టివ్యష్టిరిత్యాద్యైస్తయోః సర్వాభిమానవాన్ ॥
హిరణ్యగర్భః సూత్రాత్మా త్రిమూర్తి శ్చేత్యుదీర్యతే।
బ్రహ్మ విష్ణుశ్చ రుద్రశ్చ మూర్తయో గుణభేదతః ॥
లింగోపాధిత్వతోజీవాః అపీశా సర్వవిత్త్వతః।
సమిష్టిస్సముదాయాత్మా వ్యష్టిస్తుపృథగాత్మవాన్ ॥

నియామకుండీశ్వరుడు, అనుమతించువాడు జీవుడు ఆ జీవుడును రెండు విధములు, సమష్టి జీవుడని, వ్యష్టి జీవుడని, వారిద్దఱిలో సర్వాభిమానము గలవాడు హిరణ్య గర్భుఁడని,

సూత్రాత్మయని, త్రిమూర్తియని చెప్పబడును. గుణభేదము వలన బ్రహ్మయని, విష్ణువని, రుద్రుడని మూడు మూర్తులు యేర్పడినవి. (ఆ హిరణ్యాగర్భునకు) లింగోపాధివలన జీవులును, సర్వజ్ఞులగుట చేత నీశ్వరులును అను భేదము గలదు సముదాయస్వరూపుడు సమిష్టి యనబడును. ప్రత్యేక ప్రత్యేకాత్మలు గలవారు (దేహములు గలవారు) వ్యష్టి యనబడును.

సమిష్టిః సూత్రవజ్జ్ఞేయో బ్రహ్మాండాఖ్యవపుర్విరాట్
దేవతిర్యఙ్మనుష్యాది దేహా వ్యష్టిరితీష్యతే ॥
పరః ప్రవిశ్య దేహేషు మాయయా గూఢవత్ స్థితః।
ద్వైతస్య మాయికత్వేన తత్త్వమద్వైతమిష్యతామ్॥

సమష్ట్యాత్మ సూత్రమువంటిదని యెఱుంగవలయును. అతఁడు బ్రహ్మాండమంతయు దనఁ శరీరముగా గలవాఁడు, విరాట్ అనబడును. దేవతలు, తిర్యగ్జంతువులు, మనుష్యులు మొదలైన వారి శరీరములు వ్యష్టి యనంబడును. పరమాత్మ దేహము లందుఁ బ్రవేశించి మాయచేతఁ గప్పబడినవాఁడువలె నుండెను. ద్వైతము మాయవలనఁ గలిగి నందున తత్త్వము (అనగా పరమాత్మ) అద్వైతమని యంగీకరింపవలయును. ఇటుల అనుభూతి ప్రకాశ గ్రంథము తెలియజేయుచున్నది.

మనుస్మృతి

113శ్లో॥ బ్రహ్మణః ప్రణవం కుర్యా దాదావన్తేచ సర్వదా।
స్రవత్యనోంకృతం పూర్వం పరస్తాచ్చ విశీర్యతే ॥

దైవికవిషయమును చదువుటకు ప్రారంభించునపుడు మొదటను కొనను యెల్లప్పుడున్ను ఓంకారము నుచ్చరింపవలయును. అట్లు ప్రారంభించునపుడు ఓంకారము నుచ్చరింపనియెడల చదివినది

యెల్ల గొంచెము కొంచెముగా మరచిపోబడును, ముగింపున ఓంకారము చెప్పని యెడల చదివినది మనస్సున నిలువజాలదు.

ప్రణవశాస్త్రము

114. శ్లో॥ ఓంకారశ్చమహావాక్యగాయత్రీభ్యాం సమన్వితః।
శాస్తిసంసారకార్యాణి సర్వాణ్యేవాధికారిణః ॥

మహావాక్యములతోను, గాయత్రీమంత్రములతోను గూడిన ఓంకారమధికారికి సంసారకార్యములన్నింటిని శాసించుచున్నది.

గాయత్రీ వేదమాతా స్యాన్మహావాక్యం పితా భవేత్ ।
ఓంకారస్సర్వమూలస్స్యాత్స ఏవ చ పితామహః ॥

గాయత్రీ వేదములకుఁ దల్లి, మహావాక్యము తండ్రి, ఓంకారమన్నింటికిని మూలము, అదియే పితామహుడు.

ఓమిత్యే తత్స్వయం జ్ఞాత్వా గాయత్రీం వేదమాతరమ్
మహావాక్యం చ విజ్ఞాయ వేదాభ్యాసఫలం లభేత్ ॥

ఓంకారమును, వేదమాతయగు గాయత్రిని, వేదమునందు చెప్పబడిన మహావాక్యమును తెలిసికొన్నవాడు వేదముల నభ్యసించిన వాని ఫలమును బొందును.

గాయత్రీ వేదమాతా చ వేదస్య ప్రణవః పితా ।
ప్రతిమంత్రం ప్రయోక్తవ్యమోమిత్యేతత్పరావరమ్ ॥

వేదములతల్లి గాయత్రి, ఓంకారము వేదములకు తండ్రి, అన్నింటికంటెను శ్రేష్ఠమయిన ఓంకారము ప్రతియొక్క మంత్రముతోను ప్రయోగించదగినది.

స్మరణాత్కీర్తనాద్వాపి శ్రవణాచ్చ జపాదపి ।
బ్రహ్మతత్ ప్రాప్యతే నిత్యమోమిత్యేతత్పరాయణమ్॥

ఓంకారమును స్మరించుచుండుటవలనను, కీర్తించుచుండుట వలనను, వినుచుండుటవలనను, జపముచేయుచుండుటవలనను, ఓంకారమే గొప్ప స్థానముగాగల ఆ పరబ్రహ్మము లభించుచున్నది.

ఓమిత్యేకాక్షరధ్యానాద్విష్ణుర్విష్ణుత్వ మాప్తవాన్।
బ్రహ్మబ్రహ్మత్వ మాపన్నశ్శివతా మభజచ్ఛివః॥

ఏకాక్షరమగు ఈ ప్రణవముయొక్క ధ్యానమువలననే విష్ణువు విష్ణుత్వమును, బ్రహ్మ బ్రహ్మత్వమును, శివుడు శివత్వమును బొందెను. ఈ విధముగ ప్రణవశాస్త్రము ప్రణవమునుగూర్చి స్తుతించెను.

వే మ న

115. ఆ ప్రణవమంత్ర మహిమ భావింప లింగంబే
మూడు మూర్తులందు మొనసియుండు,
మాన్యులెఱిగి కొలువ మనుజుల శక్యమా!
విశ్వదాభిరామ! వినుర వేమ!
ప్రణవ మెఱుగ నతడు భక్తుండు తాగాడు
జ్యోతిజూడ నతడు జోగిగాడు
నిత్యమెఱుగ నతడు నిర్వాణి కాడయా!
విశ్వదాభిరామ! వినురవేమ!

ప్రణవరహస్యమును నెఱింగినవాడే భక్తుడన బడుచున్నాడు జ్యోతి స్వరూపమును గాంచినవాడే యోగీశ్వరుడు. నిత్యమగు పరబ్రహ్మస్వరూపమును గుర్తెఱింగినవాడే నిర్వాణి యని చెప్పబడుచున్నాడు.

శ్రీ మదాంధ్ర భాగవతము (సప్తమ స్కంధము)

116. మం॥ కలఁడంబోధిగలండు గాలిఁగలఁడాకా
శంబునం గుంభినిం
గలఁడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలం ఖద్యోత
చంద్రాత్మలం
గలఁడోంకారమునఁ ద్రిమూర్తులఁ ద్రిలింగ
వ్యక్తులందంతట
గలడీశుండు గలండు తండ్రి వెదకంగా నేల
నీ యా యెడన్. 274

ప్రహ్లాదుని తండ్రియగు హిరణ్యకశిపుఁడు భగవంతుడెచ్చట యున్నాడని యడుగగా హృదయంబున హరిందలంచి, నమస్కరించి, బాలవర్తనంబున నర్తంబు సేయుచు నిట్లనియె. ఆ భగవంతుఁడు సముద్రములో, గాలిలో, నాకాశములో, భూమిలో, నగ్నిలో, దిక్కులలో, రాత్రింబవళ్ళ, సూర్య చంద్ర స్వరూపములో గలడు. ఓంకారమునందును, బ్రహ్మ విష్ణు మహేశ్వరులందును, స్త్రీలింగ, పుంలింగ, నపుంసకలింగ వ్యక్తులలో నా సర్వేశ్వరుఁడున్నాడు. సర్వాంతర్యామియై నన్నిచోట్లను గలడు. తండ్రీ! ఇచ్చోట నచ్చోట నని వెదుకనేల. ఇట్లు చెప్పినందుచే సర్వేశ్వరుఁడు ప్రణవస్వరూపుడై సందులేక నిండియున్నాడని నెఱుంగవలయును.

సీ॥ రథము మేనెల్ల సారథి బుద్ధి యింద్రియ
గణము గుఱ్ఱములు పగ్గములు మనము
ప్రాణాది దశవిధ పవనంబు లిరుసు
ధర్మాధర్మగతులు రథాంగకములు,
బహుళ తరంబైన బంధంబు చిత్తంబు

శబ్దాదికములు సంచార భూము,
లభిమాన సంయుతుండయిన జీవుఁడు రథి
ఘనతరప్రణవంబు కార్ముకంబు

తే॥ శుద్ధజీవుండు బాణంబు శుభదమైన
బ్రహ్మమంచిత లక్ష్యంబు పరులు రాగ
భయమదద్వేష శోకలోభ ప్రమోహ
మానమత్సర ముఖములు మానవేంద్ర.

శరీరమే రథము, బుద్ధి సారథి, ఇంద్రియములు గుఱ్ఱములు, మనస్సు పగ్గములు, ప్రాణము మొదలుగా గల పది వాయువులిరుసు, ధర్మాధర్మములు చక్రములు, వాటిని బిగియకట్టుటే చిత్తము. శబ్ద స్పర్శ రూపాదులు సంచరించు ప్రదేశములు, అభిమానముతో గూడుకొన్న జీవుఁడు రథికుడు. గొప్పదగు ప్రణవమే ధనస్సు, శుద్ధ జీవుఁడే బాణము, శ్రేయస్సు నొసగెడు బ్రహ్మమే చలించని లక్ష్యము. ఈ ప్రకారముగా దలంచి యంతరంగ శత్రువులగు రాగ ద్వేషాదుల ఓ రాజేంద్రా! జయింపవలయును. ఇటుల అజగర మహర్షి ప్రహ్లాదునికి చెప్పెను.

వ॥ ఇట్లు మనుష్యశరీరరూపంబయిన రథంబు దనవశంబు చేసికొని మహాభాగవత చరణకమల సేవా నిశితంబయిన విజ్ఞాన ఖడ్గంబు ధరియించి, శ్రీమన్నారాయణ కరుణావలోకనబలంబున రాగాదిశత్రు నిర్మూలనంబు గావించి ప్రణవబాణాసనంబున శుద్ధజీవ శరంబును సంధించి బ్రహ్మమనియెడి గుఱియందు బడవేసి యహంకారరథికుడు రథికత్వంబు మాని నిజానందంబున నుండవలయు.

117. రసోఽహమప్సు కౌన్తేయ! ప్రభాఽస్మి శశి
సూర్యయోః।
ప్రణవస్సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥

ఏ యే ధర్మములతో గూడుకొనిన పరమాత్మయందు నీ సమస్త జగత్తు యెటుల గ్రుచ్చబడియున్నదో చెప్పబడుచున్నది. ఓ అర్జునా! జలములలో సారభూతమగు రసమెద్దో, ఆ రసస్వరూపుడనగు నాయందు జలములు గ్రుచ్చబడియున్నవి. చంద్రసూర్యుల కాంతి స్వరూపుడనైన నాయందు చంద్రసూర్యులు అనుస్యూతులై యున్నారు. వేదములకు సారభూతమైనది ప్రణవము. అట్టి ప్రణవ స్వరూపుడనగు నా యందు సమస్త వేదములున్నవి. ఆకాశమందు శ్రేష్ఠమైన శబ్దము నేనే. ఆ శబ్దస్వరూపుడనగు నాయందు నాకాశము చేర్చబడియున్నది. అటులనే మానవులందు శ్రేష్ఠమైనది పురుషభావము. అనగా పురుషత్వబుద్ధి నేనే. అట్టి స్వరూపుడనగు నాయందు పురుషులుంటున్నారు. ఇట్లు చెప్పినందుచే దారములో మణులవలె భగవంతునియందు సమస్త భూతములు గ్రుచ్చబడియున్నవి. అనగా భగవంతుడు సర్వాంతర్యామి యని యర్థము.

మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః॥

మహర్షులలో భృగువు, వాక్కులలో అక్షరమగు ప్రణవము, యజ్ఞములలో జపయజ్ఞము, పర్వతములలో హిమాలయము నేనై యున్నాను.

యదక్షరం వేదవిదో వదన్తి విశన్తియద్యత యో
వీతరాగాః।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్ర
హేణ ప్రవక్ష్యే॥

ఏ పరబ్రహ్మమును వేదార్థజ్ఞులు అవినాశియని చెప్పుచున్నారో, యిందులకు ప్రమాణము "తద్వా ఏతదక్షరం గార్గి బ్రాహ్మణాఽభివదన్తి" బృహదారణ్యకోపనిషత్. ఆ బ్రహ్మమును సర్వవిశేష రహితమనియు యిందులకు ప్రమాణము "అస్థూలమనణు" బృహదారణ్యకోపనిషత్తు ఇత్యాదులు మఱియు ప్రయత్నశీలురగు సన్న్యాసులు యాసక్తురహితులైనవారలై, ఏ పరబ్రహ్మమును ప్రవేశించుచున్నారో, ఏ అక్షరమును తెలిసికొనగోరినవారై గురు సన్నిధానములో బ్రహ్మచర్యము ననుష్ఠించుచున్నారో, అట్టి యవ్యయమైన గంతవ్యస్థానమగు పరబ్రహ్మమును సంగ్రహముగ చెప్పుచున్నాను.

"సయోహవై తద్భగవన్మనుష్యేషు ప్రాయణాన్త మోంకారమభిధ్యాయీత, కతమంవావ స తేనలోకం జయతీతి తస్మై సహోవాచ, ఏతద్వై సత్యకామ పరం చాపరం చ బ్రహ్మయదోంకారః ఇతి ఉపక్రమ్య యః పునరేతం త్రిమాత్రేణోమిత్యే తేనైవాక్షరేణ పరం పురుష మభిధ్యాయీత" ప్రశ్నోపనిషత్.

ఇవి మొదలుగాగల వాక్యములచేత

"అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్" యిట్లని ప్రారంభించి

"సర్వేవేదాయత్పదమామనన్తి,తపాంసి సర్వాణి చ యద్వదన్తి, యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి,తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్" (కఠోపనిషత్తు) యివి మొదలుగా గల వచనములచేత పరబ్రహ్మమునకు వాచక రూపమై విష్ణ్వాదులకు విగ్రహమువలె ప్రతీకమై (చిహ్నమై) పరబ్రహ్మప్రాప్తికి అవ్యవహితసాధనమగుట చేత, మందమధ్యమాధికారులకు యీ ప్రణవోపాసన కాలాన్తరములోనైన (జన్మాన్తరములోనైన) ముక్తిప్రదమై యున్నది.

సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణాం ॥


సమస్తేంద్రియ గోళకములను నియమించి అనగా ఇంద్రియముల తత్తద్విషయములలోను, విషయములకు కారణమగువాటిలోను, ప్రవర్తించనటుల సంయమనమును జేసి మనస్సును హృదయ పుండరీకములో పరమాత్మ భావనచే నిరోధించి (వృత్తి రహితముగా జేసి) అట్టి స్వాధీనపడిన మనస్సుచేత తన ప్రాణమును హృదయమునుండి నూర్ధ్వగామియైన నాడీ ద్వారా యూర్ధ్వమును బొందించి బ్రహ్మరంధ్రములోనునిచి, ఇటుల యోగధారణ చేయవలయును. అనగా "వృత్తిహీనం మనః కృత్వాక్షేత్రజ్ఞం పరమాత్మని, ఏకీకృత్య విముచ్యేత యోగోఽయం ముఖ్యఉచ్యతే" -మనస్సును వృత్తిరహితము చేసి యాత్మను పరమాత్మలో నైక్య పరచుట యోగమనబడును. అన్నట్లు యిట్టి యోగమందు సుస్థిరుడు కావలయును. ఇట్టి యోగీశ్వరుడు యెటువంటి యుత్తమగతిని పొందుచున్నాడనునది క్రింద ప్రతిపాదింపబడుచున్నది.

118. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్।
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం
గతిమ్ ॥

పరబ్రహ్మమునకు నామధేయమైన **ఓంకారము** నుచ్చరించుచు, తదర్థరూపమైన నన్ను చింతించుచు **యెవడు** దేహమును వదలుచున్నాడో, అట్టి యోగీశ్వరుడు యుత్కృష్టగతిని బొందుచున్నాడు.

ఓం తత్ సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః.



22.	జీవన్ముక్తి	2-00
23.	తులసీ బృందావనము	4-00
24.	ధర్మపథము (బుద్ధగీత)	8-00
25.	దశశాంతులు	1-00
26.	దక్షిణామూర్తిస్తోత్రం	5-00
27.	ధర్మోపన్యాసములు నాలుగు భాగములు ఒక్కొక్కటి	38-00
28.	వివేకచూడామణి	160-00
29.	దాసబోధ	94-00
30.	దేవీస్తోత్రాణి	4-00
31.	దేవీప్రణవశ్లోకి	3-00
32,	ధ్యానామృతము	6-00
33.	నమశ్శివాయ గేయామృతము	2-00
34.	నిత్యప్రార్థన	1-00
35.	నిర్వాణ నిలయము	7-00
36.	నిర్విఘ్న యోగసిద్ధి	19-00
37.	నా గురుదేవుడు	25-00
38.	మహాభగవద్గీత	125-00
39	ప్రశ్నోత్తరమణిరత్నమాల	2-00
40.	ప్రమాదమునొందకుడు	2-00
41.	ప్రాతఃకాలప్రార్థన	2-00
42.	ప్రేమసంఘప్రార్థనాగీతములు	5-00
43.	గురుగీత	45-00
44.	భజగోవిందము	2-00